




అసమ్మతితో.. సతమతం

- ఫలించని బెదిరింపులు.. బుజ్జగింపులు
- ప్రచారంలో దూసుకుపోతున్న టీడీపీ అభ్యర్థులు
- టీడీపీలోకి క్యూ కడుతున్న వైసీపీ నేతలు, కార్యకర్తలు

పౌరుషాల పల్నాడు జిల్లాలో ఎన్నికల వేళ రాజకీయ సమీక రణలు వేగంగా మారుతున్నాయి. వైసీపీని అసమ్మతి బెడద వేధిస్తుండగా, టీడీపీకి ఏ ఒక్కస్థానం లోనూ ఆ పరిస్థితి లేదు. ఫ్యాన్ పార్టీలో అభ్యర్థులను నేతలు, కార్యకర్తలు వ్యతిరేకి స్తున్నారు. వారిపై ఆ పార్టీ పెద్దల బెదిరింపులు.. బుజ్జగింపులు ఫలించడం లేదు. వైసీపీ నుంచి తెలుగుదేశం పార్టీలోకి భారీ గా నేతలు, కార్యకర్తలు క్యూ కడుతున్నారు. ఎన్నికల రణక్షేత్రం లో ఒకరినొకరు ఢీ కొనేందుకు అభ్యర్థులు సమాయత్తమ య్యారు. తెలుగుదేశం, వైసీపీ పార్టీలు ఏడు నియోజక వర్గాలకు, నరసరావుపేట లోక్‌సభ స్థానానికి అభ్యర్థులను బరిలో దింపాయి. పార్టీలు ఎన్నికల వ్యూహాలను సిద్ధం చేసుకుంటున్నాయి.

ఫ్యాన్ పార్టీ అభ్యర్థులకు అసమ్మతి సెగ

(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)


టీడీపీ అభ్యర్థులు బాబు భరోసా కార్యక్రమం ద్వారా సూపర్ సిక్స్ పథకాలను ఇంటింటికీ వివరిస్తున్నారు. ప్రచార పర్వంలో తెలుగు తమ్ముళ్లు దూసుకుపోతున్నారు. గడపగడపకు వైసీపీ పేరుతో ఆపార్టీ అభ్యర్థులు ప్రచారం చేస్తున్నారు. వైసీపీ పాలనలో జరిగిన అరాచకాలు, అవినీతిని ప్రజల్లోకి తీసుకువెళ్లడమే ప్రధాన అజెండాగా టీడీపీ పనిచేస్తోంది. తెలుగుదేశం పార్టీ లోక్‌సభ అభ్యర్థిగా లావు శ్రీ కృష్ణదేవరాయలు, వైసీపీ అభ్యర్థిగా అనిల్‌కుమార్ యాదవ్‌లు తలపడుతున్నారు. సిట్టింగ్ ఎంపీగా బరిలో దిగిన లావు శ్రీకృష్ణ తాను చేసిన అభివృద్ధి పనులను ఓటర్లకు వివరిస్తున్నారు. తనను గెలిపిస్తే నియోజకవర్గానికి చేయబోయే అభివృద్ధి పనులను ఓటర్లకు తెలియజేస్తూ ప్రచారంలో దూసుకుపోతున్నారు. ఏడు నియోజకవర్గాల్లో అసెంబ్లీ అభ్యర్థులతో కలసి ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. వివిధ నియోజక వర్గాల్లో పార్టీ అభ్యర్థులపై ఉన్న వ్యతి రేకత వైసీపీ అభ్యర్థి అనిల్‌కుమార్ యాదవ్‌కు తలనొప్పిగా మారింది. అసమ్మతిని బుజ్జగించేందుకు ఆయన తలమునకలవుతున్నారు.

మాచర్ల..

అందరి దృష్టి మాచర్ల నియోజకవర్గంపైనే ఉంది. ఇక్కడ నుంచి టీడీపీ అభ్యర్థిగా జూలకంటి బ్రహ్మారెడ్డి బరిలో దిగారు. దాయాదుల మధ్య పోరు పల్నాటి పోరును తలపిస్తోంది. ప్రత్యర్థి పిన్నెల్లి రామకృష్ణారెడ్డిని జూలకంటి అన్ని విధాలా ఎదుర్కొంటున్నారు. తెలుగుదేశం శ్రేణుల్లో బ్రహ్మారెడ్డి కొత్త ఉత్సాహాన్ని నింపారు. ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకతలను తనకు అనుకూలంగా మలచుకుంటున్నారు. ఈ నియోజకవర్గంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు జరుగుతున్నాయి. నియోజవర్గ ఓటర్లల్లో తాను అండగా ఉంటానన్న ధైర్యాన్ని నింపడంలో జూలకంటి సక్సెస్ అయ్యారు. ఈసారి మాచర్లలో టీడీపీ జెండా ఎగురవేస్తామని పార్టీ శ్రేణులు చెబుతున్నాయి. ఇక్కడ జూలకంటి సర్వశక్తులు ఒడ్డుతున్నారు. గెలుపే లక్ష్యంగా టీడీపీ ప్రచార పర్వం సాగుతోంది. మహిళల నుంచి జూలకంటికి విశేష ఆదరణ లభిస్తోంది. అరాచకం ద్వారా ఓటర్లను భయభ్రాంతులకు గురి చేసి లబ్ధి పొందే వ్యూహంలో ప్రత్యర్థి వర్గం ఉన్నట్టు ప్రచారం. వరుసగా నియోజకవర్గంలో టీడీపీ మద్దతు దారులపై జరుగుతున్న దాడులే నిదర్శనం. ప్రత్యర్థి వ్యూహాన్ని అడ్డుకొని ఓటర్లలో ధైర్యాన్ని నింపేందుకు జూలకంటి ప్రయత్నిస్తున్నారు. ప్రశాంత ఎన్నికలు నిర్వహించే దిశగా పోలీసు యంత్రాంగం ఇప్పటి నుంచే చర్యలు తీసుకోవాలని ఓటర్లు కోరుతున్నారు.

నరసరావుపేట..

నరసరావుపేటలో కూడా అసమ్మతిని వైసీపీ అభ్యర్థి డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాసరెడ్డి ఎదుర్కొంటున్నారు. డాక్టర్ గజ్జల బ్రహ్మారెడ్డి వర్గం గోపిరెడ్డితో కలసినప్పటికీ గతంలో వలే ఈ వర్గం గోపిరెడ్డికి పూర్తి స్థాయిలో పనిచేస్తున్న దాఖలాలు లేవు. ఇరువర్గాల కలయిక మమ అనిపించినట్లుందని పార్టీ వర్గాలు భావిస్తున్నాయి. నరసరావుపేట మండలంలోని వైసీపీకి కంచుకోటగా ఉన్న ఉప్పలపాడు గ్రామంలో కూడా గోపిరెడ్డిపై వ్యతిరేకత వ్యక్తం చేస్తున్నారు. ఈ గ్రామంలో పార్టీ పెద్దల నుంచి గోపిరెడ్డికి చేదు అనుభవం ఎదురైంది. 21 ప్రశ్నావళిని ఆయనకు సమర్పించి వీటికి సమాధానం చెప్పాలని నిలదీయడం గమనార్హం. పార్టీ అడ్డాగా ఉన్న వరవకట్టలో కూడా వైసీపీకి గండిపడటం గమనార్హం. వరవకట్టకు చెందిన షేక్ ఇబ్రహీం హత్య కూడా వరవకట్టలో వైసీపీకి నష్టాన్ని కలిగించిందని పార్టీ వర్గాలే చెబుతున్నాయి. ఈ నేపథ్యంలోనే వరవకట్టకు చెందిన పలువురు ముస్లింలు టీడీపీలో చేరడం చర్చనీయాంశమైంది. సొంత సామాజికవర్గం నుంచి కూడా గోపిరెడ్డి వ్యతిరేకత ఎదుర్కోవడం గమనార్హం. లింగంగుంట్లలో కూడా ఒక వర్గం దూరంగా ఉంటున్నట్టు సమాచారం. రొంపిచర్ల మండలంలో కూడా కొందరు నేతలు ఇంకా వ్యతిరేకతతోనే ఉన్నట్టు పార్టీ వర్గాలు తెలిపాయి. పట్టణంలో కూడా గత ఎన్నికల నాటి పరిస్థితి నేడు గోపిరెడ్డికి లేదు. పట్టణంలోని మాజీ కౌన్సిలర్లు కూడా అసంతృప్తితో ఉన్నారు. కొన్ని ప్రాంతాల్లో ఆయనకు వ్యతిరేకత వ్యక్తమవుతోంది. టీడీపీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబుకు ఎమ్మెల్యేపై ఉన్న వ్యతిరేకత కలసిస్తోంది. గత ఎన్నికల్లో ఓటమి చెందిన అరవిందబాబుకు నియోజవర్గ ఓటర్ల నుంచి సానుభూతి లభిస్తోంది. ఇప్పటికే పార్టీ నిర్వహించిన వివిధ కార్యక్రమాల ద్వారా పట్టణంలో ప్రతి వీధిలో నాలుగైదు సార్లు పర్యటించిన నేతగా అరవిందబాబు గుర్తింపు పొందారు. ఇక్కడ పోటీ రసవత్తరంగా మారింది.



చిలకలూరిపేట..

చిలకలూరిపేటలో సీనియర్ నేత మాజీమంత్రి పత్తిపాటి పుల్లారావు పోటీ ఏకపక్షంగా సాగుతోంది. ఇక్కడ వైసీపీ అభ్యర్థులుగా ఇరువురిని మార్చింది. చివరకు గుంటూరు మేయర్ కావేటి మనోహర్‌నాయుడిని బరిలో దింపింది. తనను అభ్యర్థిగా తొలగించడంపై మల్లె రాజేష్‌నాయుడు తీవ్రంగా వ్యతిరేకించారు. చివరకు ఆయన వైసీపీని వీడి తెలుగుదేశంలో చేరారు. ఆయనతో పాటు తన టీమ్ మొత్తాన్ని, మునిసిపల్ కౌన్సిలర్లను టీడీపీలో చేర్చారు. కావటికి తీవ్రస్థాయిలో స్థానికుల నుంచి వ్యతిరేకత వ్యక్తమవుతోంది. పార్టీలోని ప్రధాన సామాజికవర్గం కూడా కావటి అభ్యర్థిత్వాన్ని వ్యతిరేకిస్తూ పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటోంది. గ్రూపుల పోరుతో కావటి సతమతమతున్నారు.

పెదకూరపాడు

పెదకూరపాడులో నంబూరు శంకర్‌రావుకు కూడా పార్టీలో వ్యతిరేకత అధికమైంది. ఇక్కడ టీడీపీ కొత్త అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను బరిలో దింపింది. మాజీ ఎమ్మెల్యే కొమ్మాలపాటి శ్రీధర్ కూడా ప్రవీణ్‌కు సంపూర్ణ మద్ద తు ఇస్తున్నారు. కొమ్మాలపాటిని పల్నాడు జిల్లా పార్టీ అధ్యక్షుడిగా అధిష్ఠానం నియమించింది. ఎమ్మెల్సీ పదవిని కొమ్మాలపాటికి ఇస్తున్నట్టు చంద్రబాబు స్వయంగా ప్రకటించిన విషయం తెలిసిందే. ప్రవీణ్ విజయం కోసం కొమ్మాలపాటి కృషి చేస్తున్నారు. కొత్త అభ్యర్థి అయినప్పటికీ పార్టీ క్యాడర్ అయన వెంట నడస్తోంది. ప్రవీణ్ ప్రచారాన్ని ముమ్మరం చేశారు. నంబూరును వ్యతిరేకిస్తూ పార్టీలోని ముఖ్య నేతలు ఆపార్టీని వీడిన విషయం తెలిసిందే. ప్రవీణ్ కొత్త అభ్యర్థి కావడంతో అయనకు కలసివచ్చే అంశంగా ఉంది. క్రోసూరులో చంద్రబాబు ప్రజాగళం సభ ఘనవిజయం సాధించింది. ఈ సభ పార్టీ శ్రేణులను కదిలించింది. మొత్తం మీద జిల్లాలో ఎన్నికల పోరు రసవత్తరంగా మారింది.

వినుకొండ..

వినుకొండలో టీడీపీ అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు, వైసీపీ అభ్యర్థి బొల్లా బ్రహ్మనాయుడు కంటే ప్రచారంలో ముందున్నారు. ఇక్కడ వైసీపీలో అస్మమతి బెడదను బొల్లా ఎదుర్కొంటున్నారు. మాజీ ఎమ్మెల్యే మక్కెన మల్లికార్జునరావు టీడీపీలో చేరడం బొల్లాకు నష్టం చేకూర్చింది. జీవీ ఇప్పటికే అధికశాతం గ్రామాల్లో పర్యటించి ఓటర్ల నుంచి మద్దతు కూడగడుతున్నారు. బొల్లాను ఓడించేందుకు మక్కెన సర్వశక్తులు వడ్డుతున్నారు. ఇక్కడ అభ్యర్థులు ఒకరిపై ఒకరు చేసుకుంటున్న విమర్శలు తారాస్థాయికి చేరాయి. ఇక్కడ జరిగిన సీఎం జగన్ రోడ్డు షోకు స్పందన అంతంత మాత్రమే. ఓటర్లలో వైసీపీపై ఉన్న వ్యతిరేకతను నిదర్శనమే జగన్ రోడ్డుకు స్పందన లేకపోవడం అన్న వాదన వినిపిస్తోంది.

గురజాల..

గురజాల..

గురజాల నియోజకవర్గంలో తెలుగుదేశం అభ్యర్థి మాజీ ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు, కాసు మహేష్‌రెడ్డి మధ్య పోరు ఆసక్తిగా సాగుతోంది. ఇరువురు నేతలు ఓడితే రాజకీయాల నుంచి తప్పుకుంటామని పరస్పరం సవాళ్లు విసురుకున్నారు. అంటే ఇక్కడ పోరు ఏ స్థాయిలో ఉందో వారి సవాళ్లు తెలియజేస్తున్నాయి. ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి, తన అనుచరులతో కలసి తెలుగుదేశం పార్టీలో చేరిన విషయం తెలిసిందే. కాసు మహేష్‌ని ఓడించడమే ధ్యేయంగా జంగా పనిచేస్తున్నారు. జంగా పార్టీని వీడటం కాసుకు తీవ్రనష్టాన్ని కలిగిస్తోంది. పార్టీలో అందరినీ కలుపుకొని యరపతినేని ప్రచారం నిర్వహిస్తున్నారు.యరపతినేనికి కొంతదూరంగా ఉన్న వర్గం కూడా ప్రస్తుతం యరపతినేని గెలుపుకోసం కృషి చేస్తోంది. దాచేపల్లిలో నిర్వహించిన రా కదిలిరా చంద్ర బాబు సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో టీడీపీ శ్రేణు లు రెట్టింపు ఉత్సాహంతో ఎన్నికల కదన రం గంలో ముందుకు సాగుతున్నారు.

సత్తెనపల్లి...

సత్తెనపల్లిలో వైసీపీ అభ్యర్థి మంత్రి అంబటి రాంబాబు కూడా పార్టీలోని నేతలు, కార్యకర్తల నుంచి వ్యతిరేకతను ఎదుర్కొంటున్నారు. ఒక ప్రధాన సామాజిక వర్గం ఆయనకు వ్యతిరేకంగా పనిచేస్తోంది. ఇప్పటికే పలువురు వైసీపీ కీలక నేతలు పార్టీని వీడి తెలుగుదేశంలో చేరారు. మాజీ ఎమ్మెల్యే యర్రం వెంకటేశ్వరరెడ్డి కూడా ఎన్నికల కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారని పార్టీ నేతలు చెబుతున్నారు. టీడీపీలో చేరిన వారిని వెనక్కు తీసుకొచ్చేందుకు అంబటి చేసిన ప్రయత్నాలు బెడిసి కొట్టాయని చెబుతున్నారు. నోటి దురుసు వల్లే పార్టీనేతలు అబంటికి దూరమయ్యారన్న టాక్ వినిపిస్తోంది. సత్తెనపల్లిలో జరిగిన జగన్ రోడ్‌షో కూడా స్పందన నామమాత్రమే. టీడీపీ అభ్యర్థి, మాజీమంత్రి కన్నా లక్ష్మీనారాయణ దాదాపు ఏడాదిగా ఆయన నియోజకవర్గంలో ప్రతి గ్రామంలో పర్యటించారు. విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహిస్తున్నారు. అబంటిని వ్యతిరేకిస్తున్న వారిని టీడీపీలో చేర్చుకోవడంలో కన్నా సక్సెస్ అయ్యారు. ఇప్పటికే పలువురు కీలక నేతలను పార్టీలో చేర్చుకున్నారు. పార్టీలోని నేతల్లో ఉన్న అసంతృప్తులను కన్నా అధిగమించారు. ఇటీవల సత్తెనపల్లిలో జరిగిన ప్రజాగళం సభలో చంద్రబాబు డాక్టర్ కోడెల శివరాంతో మాట్లాడి కన్నా విజయానికి కృషి చేయాలని సూచించిన విషయం తెలిసిందే. ఈ నియోజకవర్గంలో కూడా వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగానే వలసలు కొనసాగుతున్నాయి. సత్తెనపల్లిలో చంద్రబాబు ప్రజాగళం సభ గ్రాండ్ సక్సెస్ కావడంతో పార్టీ క్యాడర్‌లో నూతన ఉత్సాహాన్ని నింపింది. కన్నా విజయం కోసం రెట్టింపు ఉత్సాహంతో పని చేస్తుంది. అంబటి ఇక్కడ ఎదురీదుతున్నారన్న ప్రచారం ఉంది.



ప్రత్తిపాడులో తాగు నీటి కోసం వైసీపీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేస్తున్న ప్రజలు

నీటి కోసం ఆందోళన

- ప్రత్తిపాడులో తాగునీటి కోసం రోడ్డెక్కిన గ్రామస్థులు
- సాగర్ ద్వారా నీరు ప్రత్తిపాడు చెరువుకు అందని పరిస్థితి
- వారం రోజులుగా ప్రత్తిపాడులో నీటి సమస్య

ప్రత్తిపాడు, ఏప్రిల్ 15: ప్రత్తిపాడు రక్షిత మంచినీటి చెరువుకు సాగర్ నీరు అందించాలంటూ అధికార పార్టీ రోడ్డెక్కింది. ప్రత్తిపాడు ప్రధాన రహదారిలో మొదలు పెట్టిన ఆందోళన ఉధృతంగా మారి ప్రత్తిపాడును పూర్తిగా అష్ట దిగ్బంధనం చేసే పరిస్థితికి వచ్చింది. ప్రత్తిపాడు నుంచి ఒక్క వాహనాన్ని కూడా ముందుకు పోనీయకుండా మల్లాయపాలెం సెంటర్‌తో పాటు అంకమ్మగుడి సెంటర్‌లో కూడా బైఠాయించారు. మహిళలు ఖాళీ బిందెలతో రోడ్డెక్కారు. ప్రధాన రహదారిపై రోడ్డుకు అడ్డంగా టెంటు వేసి ఆందోళన కొనసాగించారు. ఉదయం ప్రారంభమైన ధర్నా మధ్నాహ్నం రెండు గంటల వరకు సాగింది.

నాగార్జున సాగర్‌కు చివరన ఉన్న ప్రత్తిపాడుకు సాగర్ కుడి కాలువ ద్వారా నీరు తీసుకురావడానికి గత నాలుగు రోజులుగా స్థానికులు కాలువమీదకు వెళ్ళి తీవ్ర ప్రయత్నాలు చేశారు. ఆదివారం సాయంత్రానికి ప్రత్తిపాడు వరకు నీటిని తీసుకురాగలిగారు. అయితే కొద్దిసేపటికే కొద్దిగా వచ్చే నీటి ప్రవాహం ఆగిపోయింది. ఈ క్రమంలో ఇక చివరన ఉన్న ప్రత్తిపాడుకు నీరు తీసుకురావడం తమ వల్ల కాదని భావించిన వైసీపీ నాయకులు పెద్ద ఎత్తున ఆందోళనకు దిగారు. ఈ క్రమంలో వారితో మాట్లాడటానికి వచ్చిన అధికారులపై విరుచుకు పడ్డారు. కాలువకు నీరు పెట్టే బాధ్యత మీకు లేదా.. మీరు ఎందుకు ఇప్పటి వరకు పట్టించు కోలేదు.. అంటూ ప్రశ్నించారు. నాలుగు రోజుల పాటు నానా ఇబ్బందులు పడ్డాం. మా మొర ఆలకించే వారే లేరు అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. దీంతో స్థానిక అధికారులకు ఏమి చెప్పాలో కూడా అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. జిల్లా అధికారులు వచ్చి మా చెరువుకు నీరు వస్తాయి అని స్పష్టమైన హామీ ఇస్తే గాని ఇక్కడి నుంచి కదిలేది లేదని మహిళలతో పాటు గ్రామస్థులు పట్టుబట్టారు. ఎన్ఎస్‌పీ కెనాల్ ఈఈ ఎం.మురళీధర్ వచ్చి ఆందోళన చేస్తున్న వారికి నీరు అందించే బాధ్యత తనదని స్పష్టమైన హామీ ఇచ్చారు. ఒక వేళ నీరు అందించలేక పోతే మీతో పాటే నేను కూడా ఇక్కడే ధర్నాలో కూర్చుంటాననడంతో ఆందోళనను విరమించారు.

ట్రాఫిక్ ఆగడంతో ఇబ్బందులు

గుంటూరు - పర్చూరు పాత మద్రాసు రోడ్డులో ట్రాఫిక్ ఆగిపోవడంతో వాహన దారులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. ఎండతో పాటు ఉక్కపోత ఉండటంతో సుమారు నాలుగు గంటల పాటు అలాగే బస్సులో వేచి ఉండాల్సిన పరిస్థితి వచ్చింది. ఊరిలో నుంచి ట్రాఫిక్‌ను మళ్లించడానికి కూడా అవకాశం లేకుండా రెండు దారుల్లో కూర్చోవడంతో పోలీసులు సైతం ఏమి చేయలేక పోయారు. చివరికి గుంటూరు వచ్చే వాహనాలను పుల్లడిగుంట, తిక్కిరెడ్డిపాలెం వద్దనే దారి మళ్లించే ఏర్పాట్లు చేశారు. పెదనందిపాడు వైపు నుంచి వచ్చే వాహనాలను గొట్టిపాడు రోడ్డువైపు మళ్లించే విధంగా ప్రత్తిపాడు సీఐ నిస్సార్ బాషా, ఎస్ఐ సోమేశ్వరరావులు చర్యలు తీసుకున్నారు.



చెరువుకు నీరు అందిస్తామంటూ హామీ ఇస్తున్న ఎన్ఎస్‌పీ కెనాల్ ఈఈ మురళీధర్

తాగునీటికి కటకట

- తక్షణమే నీరు విడుదల చేయాలి
- నాదెండ్ల మండల వాసుల డిమాండ్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: తాగునీటి కోసం తుర్లపాడు మేజరుకు నీరు విడుదల చేయాలని నాదెండ్ల మండల ప్రజలు డిమాండ్ చేశారు. సోమవారం పల్నాడు జిల్లా కేంద్రం నరసరావుపేటలోని జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయం వద్ద నాదెండ్ల మండలం వాసులు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ నాదెండ్ల మండలంలోని నాదెండ్ల, అప్పాపురం, ఎండుగుంపాలెం గణపవరం, కనపర్తి, సాతులూరు చెరువులు పూర్తిగా ఎండిపోయాయని ఆందోళన వ్యక్తం చేశారు. గత రెండు సంవత్సరాలుగా ఒక్కసారి కూడా పూర్తిగా చెరువులు నింపలేదన్నారు. ఎన్ఎస్‌పీ, ఆర్‌డబ్ల్యుఎస్ అధికారులు ఒకరి మీద ఒకరు చెప్పుకోవడం తప్ప మంచినీరు మాత్రం ఇవ్వలేదన్నారు. నాదెండ్ల మండలం నుంచి పోయే తుర్లపాడు మేజరు ద్వారా 8 గ్రామాలకు తాగునీరు అందుతుందన్నారు. తక్షణమే తుర్లపాడు మేజరుకు నీరు విడుదల చేసి చెరువులు నింపి ప్రజల తాగునీటి ఇబ్బందులు తొలగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాదెండ్ల మండలం అధ్యక్షుడు బండారుపల్లి సత్యనారాయణ, నల్లమోతు హరిబాబు, వివిధ గ్రామాల ప్రజలు పాల్గొన్నారు.



జలవనరుల శాఖ పర్యవేక్షక ఇంజనీరు కార్యాలయం వద్ద ధర్నా చేస్తున్న నాదెండ్ల మండల ప్రజలు

వైసీపీ నేత.. మట్టి మేత

- అక్రమ మట్టి తవ్వకాలు చేస్తున్న యంత్రాలు పట్టివేత
- వైసీపీ నేత అంజిరెడ్డితో పాటు మరో ఇద్దరిపై కేసు

మాచవరం, ఏప్రిల్15: గత కొన్ని రోజులుగా అక్రమ మట్టితవ్వకాలు నిర్వహిస్తున్న పలు యంత్రాలను పట్టుకొని ముగ్గురు వ్యక్తులపై మాచవరం పోలీసులు కేసు నమోదు చేశారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత గోగిరెడ్డి అంజిరెడ్డి ఆధ్వర్యంలో ఒక జేసీబీ, 10 ట్రాక్టర్లతో వేమ వరం, వెల్లంపల్లి గ్రామాల మధ్య వున్న పులిచింతల ముంపు భూముల్లో అక్రమ మట్టి తవ్వకాలు నిర్వహిస్తున్నారు. సమాచా రం అందుకున్న మాచవరం పోలీసులు సోమవారం తెల్లవారుజామున వెల్లంపల్లి గ్రామానికి చెందిన ముంపు భూముల వద్దకు వెళ్లి అక్రమంగా మట్టితవ్వుతున్న యంత్రాలను స్వాధీనం చేసుకున్నారు. పిన్నెల్లి గ్రామానికి చెందిన వైసీపీ నేత గోగిరెడ్డి అంజిరెడ్డి, వేమవరం గ్రామానికి చెందిన కామిశెట్టి వెంకటేశ్వర్లు, దాచేపల్లి పట్టణానికి చెందిన వేణు అనే ముగ్గురిపై కేసులు నమోదు చేసినట్లు ఎస్ఐ అమీనుద్దీన్ సోమవారం తెలిపారు. వీరిని కూడా కోర్టుకు తరలించడం జరిగిందని ఆయన పేర్కొన్నారు. గత కొన్ని రోజులుగా అక్రమ మట్టి తవ్వకాలు జరుగుతున్నప్పటికీ ఎట్టకేలకు సోమవారం తెల్ల వారుజామున అక్రమ మట్టి తవ్వకం దారులు చిక్కారు.





పోలీసులు స్వాధీనం చేసుకున్న ఎక్స్‌కవేటర్ ట్రాక్టర్

దిక్సూచి DIKSUCHI

న్యూఢిల్లీ కేంద్రంగా పనిచేసే మానవాభివృద్ధి సంస్థ(ఇన్‌స్టిట్యూట్ ఫర్ హ్యూమన్ డెవలప్‌మెంట్), జెనీవా కేంద్రంగా పనిచేసే అంతర్జాతీయ కార్మికసంస్థ(ఐఎల్‌ఓ) సంయుక్తంగా ఇండియా ఎంప్లాయ్‌మెంట్ నివేదిక 2024ను తయారుచేసి ఇటీవల విడుదల చేశాయి. పోటీప రీక్షలకు తయారయ్యే విద్యార్థులు ఈ నివేదికలోని ముఖ్యాంశాలను పరిశీలించి దృష్టిలో పెట్టుకోవాలి. ఆర్థికవేత్తలు, అర్థశాస్త్ర విద్యార్థులు ఈ నివేదికను చదవడం అవసరం. ఇతరులు కూడా నివేదికలోని ప్రధానాంశాలను పరిశీలించినా భారత ఆర్థికవ్యవస్థ, ఉద్యోగితా/ నిరుద్యోగం స్థితిపై ఒక అవగాహనకు వచ్చే అవకాశం ఉంది. ఈ నివేదిక ప్రకారం భారతదేశంలో ఉద్యోగితా స్థితికి సంబంధించిన కొన్ని ముఖ్యమైన ఆర్థిక చలాంకాల ధోరణి ఈ మధ్య కాలంలో కిందివిధంగా ఉంది.

ఇండియా ఎంప్లాయ్‌మెంట్ రిపోర్ట్



పోటీ పరీక్షల ప్రత్యేకం

ఎకానమీ

భారత శ్రామికశక్తి: పదిహేను సంవత్సరాలు, ఆపై వయసు ఉండి ఉపాధి కోసం ఎదురు చూస్తున్న వారు, ఉపాధి పొందుతున్న వారి మొత్తాన్ని శ్రామికశక్తి(లేబర్ ఫోర్స్)గా పరిగణిస్తారు.

శ్రామికశక్తి రేటు: మొత్తం జనాభాలో శ్రామికశక్తి శాతాన్ని శ్రామికశక్తి రేటు(లేబర్ ఫోర్స్ పార్టిసిపేషన్ రేట్) అంటారు. 2024 ఉద్యోగితా నివేదిక ప్రకారం భారత దేశ శ్రామికశక్తి రేటు 2022లో 55.2 శాతంగా ఉంది. అయితే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు 59.8 శాతంగా ఉండటం గమనార్హం. అంటే ప్రపంచ సగటు శ్రామికశక్తి రేటు కంటే మన దేశ శ్రామికశక్తి రేటు తక్కువగా ఉంది.

- అంతేకాకుండా కొంతకాలంగా భారత శ్రామికశక్తి రేటు తగ్గుతూ ఉండటం గమనించదగ్గ విషయం. భారత శ్రామికశక్తి రేటు 2000లో 61.6 శాతం కాగా 2019 నాటికి 50.2 శాతానికి చేరింది. అయితే 2022 నాటికి తిరిగి అది 55.2 శాతానికి పెరిగింది. నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 39.63 కోట్లు ఉండగా 2019 నాటికి 49.55 కోట్లకు పెరిగింది. అంటే దాదాపు పదికోట్లు(9.92 కోట్లు) పెరిగింది. ఇక 2022లో భారత శ్రామికశక్తి 56.74 కోట్లుగా ఉంది.

కార్మికశక్తి(వర్కింగ్ ఫోర్స్): ఏదేని ఆర్థిక కార్యక్రమంలో ఉపాధి పొందుతున్న వారిని కార్మికశక్తి అంటారు. మొత్తం జనాభాలో కార్మికశక్తి శాతాన్ని జనాభా కార్మికశక్తి నిష్పత్తిగా పిలుస్తారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారత కార్మికశక్తి నిష్పత్తి 2022లో 52.9 శాతంగా ఉంది. అయితే 2000లో ఇది 60.2 శాతంగా ఉండి 2019 నాటికి 47.3 శాతానికి తగ్గింది.

- నిరపేక్షికంగా భారత శ్రామికశక్తి 2000లో 38.71 కోట్లు కాగా 2019లో 46.65 కోట్లు, ఇక 2022లో 54.45 కోట్లు.

నిరుద్యోగం రేటు: మొత్తం శ్రామికశక్తిలోని నిరుద్యోగుల శాతాన్ని నిరుద్యోగరేటు అంటారు.

సాధారణ స్థితి నిరుద్యోగం

సర్వే సంబంధిత సంవత్సరకాలం(365 రోజులు)లో ఎక్కువ కాలం ఉపాధి దొరకని వారిని సాధారణ స్థితి నిరుద్యోగులు అంటారు. 2024 ఉద్యోగితా స్థితి నివేదిక ప్రకారం భారతదేశ సాధారణ స్థితి(యూజ్‌వల్ స్టేటస్) నిరుద్యోగం రేటు 2000లో 2.3 శాతం ఉండగా 2019 నాటికి 5.8 శాతానికి పెరిగింది. అయితే 2022 నాటికి తిరిగి 4.1 శాతానికి చేరింది. నిరపేక్షికంగా సాధారణ స్థితి నిరుద్యోగుల సంఖ్య 2000లో 9.2 మిలియన్లు ఉండగా 2019 నాటికి 29 మిలియన్లకు చేరింది. అయితే 2022లో అది 22.9 మిలియన్లుగా ఉంది.

- మొత్తమ్మీద శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి రేటు 2000 నుంచి 2019 సంవత్సరాల మధ్య తగ్గగా, 2019-2022ల మధ్య పెరిగాయి. ఇక నిరుద్యోగం రేటు 2000-2019 సంవత్సరాల మధ్య పెరగ్గా 2019-22 సంవత్సరాల మధ్య తగ్గింది. 2012 నుంచి 2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి పెరిగిన స్థాయిలో ఆర్థికవ్యవస్థలో ఉపాధి అవకాశాలు విస్తరించకపోవడం వల్ల నిరుద్యోగం రేటు పెరిగిందని నివేదిక పేర్కొంది.
- అయితే 2019-2022 సంవత్సరాల మధ్య నిరుద్యోగం రేటు కొంత తగ్గినప్పటికీ ప్రపంచ ఆర్థిక మందగమనం దృష్ట్యా ఉద్యోగాల నాణ్యత, తక్కువ ప్రతిఫలంతో కూడిన ఉద్యోగిత గమనించదగ్గ అంశాలుగా నివేదిక చెప్పింది.

పురుషుల, స్త్రీల ఉద్యోగితా స్థితి

- 2022 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 77.2 శాతం ఉండగా, స్త్రీల శ్రామికశక్తి రేటు 32.8 శాతంగా ఉండటం గమనార్హం. ప్రపంచ సగటు మహిళా శ్రామికశక్తి రేటు 47.3 శాతం కాగా దక్షిణాసియా సగటు మహిళా శ్రామికశక్తి రేటు 24.8 శాతంగా ఉంది. 2000 సంవత్సరంలో పురుషుల శ్రామికశక్తి రేటు 83.6 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 38.9 శాతంగా, 2019లో పురుషుల శ్రామికశక్తి రేటు 75.5 శాతం ఉండగా స్త్రీల శ్రామికశక్తి రేటు 24.5 శాతంగా ఉంది. కార్మికశక్తి నిరుద్యోగం రేట్లలో కూడా ఇదే ధోరణి ఉంది.

గ్రామీణ, పట్టణ ఉద్యోగితా స్థితి

- మొత్తమ్మీద పురుషులు, స్త్రీల విషయంలోనూ, గ్రామాలు, పట్టణాల్లో కూడా 2000-2019 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం తగ్గగా, నిరుద్యోగం రేటు పెరిగింది. 2019-22 సంవత్సరాల మధ్య శ్రామికశక్తి రేటు, కార్మికశక్తి శాతం పెరగ్గా నిరుద్యోగం రేటు తగ్గింది.



డా.ఎం.ఏ.మాలిక్,
అసోసియేట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ డిగ్రీ కళాశాల, కూకట్‌పల్లి,
హైదరాబాద్.

ఐకార్ ఆలిండియా పీజీ, పీహెచ్‌డీ ఎంట్రెన్స్ టెస్ట్



వ్యవసాయ సంబంధిత పీజీ, పీహెచ్‌డీ కోర్సుల్లో నిర్దేశిత కోటా సీట్ల భర్తీకి ఉద్దేశించిన 'ఇండియన్ కౌన్సిల్ ఆఫ్ అగ్రికల్చరల్ రీసెర్చ్(ఐకార్) ఆలిండియా ఎంట్రెన్స్ ఎగ్జామినేషన్(ఏఐఈఈఏ)పీజీ 2024', ఐకార్ ఆలిండియా కాంపిటీటివ్ ఎగ్జామినేషన్ ఫర్ డాక్టోరల్ డిగ్రీ ప్రోగ్రామ్స్ (ఏఐసీఈ- జేఆర్ఎఫ్/ఎస్ఆర్ఎఫ్-పీహెచ్‌డీ)2024'లకు నోటిఫికేషన్‌లు వెలువడ్డాయి. ఈ ఎగ్జామ్‌లను నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ(ఎన్‌టీఏ) నిర్వహిస్తోంది. వీటిలో సాధించిన మెరిట్, కౌన్సెలింగ్ ఆధారంగా అడ్మిషన్స్ ఇస్తారు.

పీజీ

విభాగాలు: ప్లాంట్ బయోటెక్నాలజీ, ప్లాంట్ సైన్సెస్, ఫిజికల్ సైన్స్, ఎంటమాలజీ అండ్ నెమటాలజీ, అగ్రానమీ, సోషల్ సైన్సెస్, స్టాటిస్టికల్ సైన్సెస్, హార్టికల్చర్, ఫారెస్ట్రీ/అగ్రో ఫారెస్ట్రీ అండ్ సిల్వికల్చర్, అగ్రికల్చరల్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీ, కమ్యూనిటీ సైన్స్, యానిమల్ బయోటెక్నాలజీ, వెటర్నరీ సైన్స్, యానిమల్ సైన్సెస్, ఫిషరీస్ సైన్స్, డెయిరీ సైన్స్, డెయిరీ టెక్నాలజీ, ఫుడ్ సైన్స్ టెక్నాలజీ, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, వాటర్ సైన్స్ అండ్ టెక్నాలజీ.

అర్హత: విభాగాన్ని అనుసరించి(బీఎస్సీ/బీఎస్సీ ఆనర్స్)(అగ్రికల్చర్/హార్టికల్చర్/ఫారెస్ట్రీ/సెరికల్చర్/బయోటెక్నాలజీ/అగ్రిల్ మార్కెటింగ్ అండ్ కో ఆపరేషన్/వెటర్నరీ సైన్సెస్/కమ్యూనిటీ సైన్స్/హోమ్ సైన్స్/డెయిరీ); (బీఈ/బీటెక్)(బయోటెక్నాలజీ/అగ్రికల్చరల్ ఇంజనీరింగ్/డెయిరీ టెక్నాలజీ/ఫుడ్ టెక్నాలజీ/డెయిరీ ఇంజనీరింగ్/ఫిషరీ సైన్స్); బీవీఎస్సీ అండ్ ఏహెచ్/బీఎఫ్ఎస్సీ తదితర కోర్సులు పూర్తిచేసిన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 19 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇది కంప్యూటర్ బేస్డ్ టెస్ట్. ఇందులో 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. కోర్సుకు సంబంధించిన సబ్జెక్టుల నుంచి ప్రశ్నలు అడుగుతారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1200; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1100; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.625

పీహెచ్‌డీ (జేఆర్ఎఫ్/ ఎస్ఆర్ఎఫ్)

స్పెషలైజేషన్‌లు: జెనెటిక్స్ అండ్ ప్లాంట్ బ్రీడింగ్, సీడ్ సైన్స్ అండ్ టెక్నాలజీ, ప్లాంట్ జెనెటిక్ రిసోర్సెస్, ప్లాంట్ పాథాలజీ, నెమటాలజీ, ఎంటమాలజీ, సెరికల్చర్, బయోకెమిస్ట్రీ, ప్లాంట్ ఫిజియాలజీ, మాలిక్యులర్ బయాలజీ అండ్ బయోటెక్నాలజీ, మైక్రోబయాలజీ, వెజిటబుల్ సైన్స్, ఫ్రూట్ సైన్స్, ఫ్లోరికల్చర్ అండ్ ల్యాండ్‌స్కేపింగ్, ప్లాంటేషన్-స్పైసెస్- మెడిసినల్ అండ్ ఆరోమాటిక్ క్రాప్స్, పోస్ట్ హార్వెస్ట్ మేనేజ్‌మెంట్, యానిమల్ జెనెటిక్స్ అండ్ బ్రీడింగ్, యానిమల్ న్యూట్రిషన్, లైవ్‌స్టాక్ ప్రొడక్షన్ మేనేజ్‌మెంట్, లైవ్ స్టాక్ ప్రొడక్ట్ టెక్నాలజీ, పౌల్ట్రీ సైన్స్, వెటర్నరీ పాథాలజీ, డెయిరీ కెమిస్ట్రీ, ఫుడ్ ప్రాసెసింగ్ టెక్నాలజీ, ఫారెస్ట్రీ, అగ్రికల్చరల్ ఫిజిక్స్, ఎన్విరాన్‌మెంటల్ సైన్స్, అగ్రికల్చరల్ ఎకనామిక్స్, అగ్రి బిజినెస్ మేనేజ్‌మెంట్, ఫుడ్ ప్రాసెస్ ఇంజనీరింగ్, ఫుడ్ సేఫ్టీ అండ్ క్వాలిటీ, అగ్రికల్చరల్ స్టాటిస్టిక్స్, బయోఇన్ఫర్మాటిక్స్, ఫుడ్ అండ్ న్యూట్రిషన్, ఆక్వాకల్చర్, కంప్యూటర్ అప్లికేషన్స్ తదితరాలు.

అర్హత: సంబంధిత స్పెషలైజేషన్‌తో మాస్టర్స్ డిగ్రీ పూర్తిచేసి ఉండాలి. అభ్యర్థుల వయసు 2024 ఆగస్టు 31 నాటికి 20 ఏళ్లు నిండి ఉండాలి.

ఎంట్రెన్స్ ఎగ్జామ్: ఇందులో మూడు పార్ట్‌లు ఉంటాయి. మొదటి పార్ట్‌లో(జనరల్ నాలెడ్జ్/రీజనింగ్ ఎబిలిటీ)(అగ్రికల్చర్, యానిమల్ హజ్బెండ్రీ, డెయిరీ, ఫిషరీస్, అలైడ్ సైన్సెస్) అంశాలనుంచి 20, రెండో పార్ట్‌లో కోర్ గ్రూప్ సబ్జెక్ట్ నుంచి 50, మూడో పార్ట్‌లో స్పెషలైజేషన్ సబ్జెక్ట్ నుంచి 50 చొప్పున మొత్తం 120 మల్టిపుల్ చాయిస్ ప్రశ్నలు ఇస్తారు. ఒక్కో ప్రశ్నకు నాలుగు మార్కులు కేటాయించారు. సమాధానాన్ని తప్పుగా గుర్తిస్తే ఒక మార్కు కోత విధిస్తారు. పరీక్ష సమయం రెండు గంటలు. ప్రశ్నపత్రం ఆంగ్ల మాధ్యమంలో మాత్రమే ఉంటుంది.

దరఖాస్తు ఫీజు: జనరల్ అభ్యర్థులకు రూ.1900; ఓబీసీ, ఈడబ్ల్యూఎస్ అభ్యర్థులకు రూ.1800; దివ్యాంగులు, ఎస్సీ ఎస్టీ అభ్యర్థులకు రూ.975.

- **ఆన్‌లైన్ దరఖాస్తుకు చివరి తేదీ:** మే 11
- **పరీక్ష కేంద్రాలు:** హైదరాబాద్, సికింద్రాబాద్, రంగారెడ్డి, వరంగల్, కరీంనగర్, తిరుపతి, విజయవాడ, విశాఖపట్నం
- **పరీక్షల తేదీ:** జూన్ 29న
- **వెబ్‌సైట్:** www.nta.ac.in, https://exams.nta.ac.in/ICAR/

ఆంధ్ర వర్సిటీలో ఇంటిగ్రేటెడ్ బీబీఏ-ఎంబీఏ

విశాఖపట్నంలోని ఆంధ్ర యూనివర్సిటీకి చెందిన స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్(ఏయూఎస్ఐబీ)- మూడేళ్ల బీబీఏ, అయిదేళ్ల ఇంటిగ్రేటెడ్ బీబీఏ+ఎంబీఏ ప్రోగ్రామ్‌లలో ప్రవేశానికి నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ ప్రోగ్రామ్‌లకు విశాఖ ఐఐఎం సహకారం అందిస్తోంది. ఇంటిగ్రేటెడ్ ప్రోగ్రామ్‌లో మొదటి మూడేళ్ల తరవాత కోర్సు నుంచి వైదొలగే వీలుంది. వీరికి బీబీఏ డిగ్రీ ఇస్తారు. గ్రూప్ డిస్కషన్స్ పర్సనల్ ఇంటర్వ్యూల ద్వారా అడ్మిషన్స్ ఇస్తారు. మొత్తం 120 సీట్లు ఉన్నాయి. తెలుగు రాష్ట్రాల అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

బీబీఏ+ఎంబీఏ వివరాలు

- ప్రోగ్రామ్‌లో భాగంగా ఫౌండేషన్ కోర్సులు, కోర్ కోర్సులు, ఎలక్టివ్ కోర్సులు, ప్రాక్టికల్ ట్రెయినింగ్, కేస్ స్టడీస్, విదేశీ ప్రొఫెసర్ల ఆన్‌లైన్ లెక్చర్స్, ప్రాజెక్ట్ వర్క్‌లు ఉంటాయి. ఏటా కంపల్సరీ ఇంటర్న్‌షిప్ ఉంటుంది.
- క్రియేటివిటీ, ఇన్నోవేషన్, క్రిటికల్ థింకింగ్, డెసిషన్ మేకింగ్, కమ్యూనికేషన్ స్కిల్స్, లీడర్‌షిప్, టీంవర్క్, బిజినెస్ ఎథిక్స్, స్ట్రాటజిక్ అనాలిసిస్, లైఫ్ స్కిల్స్ తదితర అంశాల్లో శిక్షణ ఇస్తారు.
- **స్పెషలైజేషన్‌లు:** మార్కెటింగ్, ఫైనాన్స్, హ్యూమన్ రిసోర్స్ మేనేజ్‌మెంట్, హోటల్ మేనేజ్‌మెంట్

అర్హత వివరాలు: గుర్తింపు పొందిన బోర్డు నుంచి ఏదేని గ్రూప్‌తో ద్వితీయశ్రేణి మార్కులతో ఇంటర్/పన్నెండోతరగతి/తత్సమాన కోర్సు ఉత్తీర్ణులైన అభ్యర్థులు దరఖాస్తు చేసుకోవచ్చు.

- **ఫీజు:** జనరల్ అభ్యర్థులకు రూ.1200; దివ్యాంగులు, ఎస్సీ, ఎస్టీ అభ్యర్థులకు రూ.1000
- **దరఖాస్తు చేరేందుకు చివరి తేదీ:** మే 18
- **వెబ్‌సైట్:** www.andhrauniversity.edu.in

'దిక్సూచి' వెబ్ పేజీలో.. సమాచారం కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/DiVzTTgలో చదవండి.

ఎడ్యు న్యూస్

'ఈజీ ఇంగ్లీష్' ఉచిత శిక్షణ

మేధా ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇంగ్లీష్ అండ్ పర్సనాలిటీ డెవలప్‌మెంట్- 30వ వార్షికోత్సవాన్ని పురస్కరించుకుని 'ఈజీ ఇంగ్లిష్' ఆన్‌లైన్ ఉచిత శిక్షణ కార్యక్రమాన్ని ఆఫర్ చేస్తోంది. ఇంగ్లీష్‌కు తోడు మోటివేషనల్ సెమినార్లు, వ్యక్తిత్వ వికాస పాఠాలు కూడా ఉంటాయి. మొత్తమ్మీద పది ముఖ్యమైన అంశాలపై శిక్షణ ఉంటుంది. ఈ సంస్థ ఫౌండర్, చీఫ్ అయిన డాక్టర్ చిరంజీవి ఆధ్వర్యంలో క్లాసులు నిర్వహణ ఉంటుంది. ఏప్రిల్ మూడో వారంలో కోర్సు ఆరంభమవుతుంది. కోర్సు కాలవ్యవధి మూడు వారాలు కాగా, ఈ నెల 21 రిజిస్ట్రేషన్ ప్రక్రియను పూర్తి చేసుకోవాలి. మరిన్ని వివరాలకోసం 9866006662 నెంబర్లో మాట్లాడవచ్చు.

హైదరాబాద్ ఐఐటీలో 'గ్రీన్కో' పీహెచ్‌డీ ఫెలోషిప్స్

హైదరాబాద్ ఐఐటిలోని గ్రీన్కో స్కూల్ ఆఫ్ సస్టయినబిలిటీ - పీహెచ్‌డీ ఫెలోషిప్‌ను ప్రకటించింది. టెక్నాలజీ డెవలప్‌మెంట్ ఫర్ నెట్ జీరో ట్రాన్సిషన్‌కు సపోర్ట్ చేసే పనిలో భాగంగా ఈ ఫెలోషిప్‌ను ఇస్తోంది. ఆరు గ్రీన్కో ఫెలోషిప్స్ ఉన్నాయి అలాగే మరో నాలుగు ఎంటెక్ ఫెలోషిప్స్ అయిదేళ్ళ కాలవ్యవధికి ఉన్నాయి. యూజీసీ - నెట్/ గేట్/ సీడ్/ సీఐఎస్ఆర్ టెస్టుని క్లియర్ చేయాల్సి ఉంటుంది. ఎంటెక్ స్కాలర్‌షిప్స్ కోరే విద్యార్థులు ఎంటెక్/ ఎమ్మెస్సీ/ ఎండిజైన్/ ఎం.ఆర్క్ పాసై ఉండాలి. రాతపరీక్ష, ఇంటర్వ్యూ ఆధారంగా అభ్యర్థుల ఎంపిక ఉంటుంది. ఎంపికైన అభ్యర్థులకు నెలకు రూ.75,000 చొప్పున నాలుగేళ్ళ పాటు చెల్లిస్తారు. మూడు లక్షల మేరకు వార్షిక కంటింజెన్సీ ఫండ్ కూడా ఇస్తారు.

వెబ్‌సైట్: http://www.iith.ac.in/phdadmissions, https://gss.iith.ac.in/

నవ్య | చిత్రజ్యోతి



కలసి నటించాలని ఎదురుచూస్తున్నా...

'వార్-2' చిత్రంతో ఎన్టీఆర్ బాలీవుడ్ ఎంట్రీ ఇస్తున్న సంగతి తెలిసిందే. ఇటీవలే ఈ చిత్రం షూటింగ్ కోసం ఎన్టీఆర్ ముంబయి వెళ్లారు. తాజాగా, నటి ఊర్వశీ రౌతేలా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతాలో తారక్‌తో దిగిన ఫొటోను అభిమానులతో పంచుకుని.. ఆయనను ప్రశంసలతో ముంచెత్తారు. "ఎన్టీఆర్‌ను కలవడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయన ఎంతో క్రమశిక్షణ, వినమ్రత, నిజాయితీ, ముక్కుసూటితనం కలిగిన వ్యక్తి. భవిష్యత్తులో ఎన్టీఆర్‌తో కలసి నటించాలని ఎదురుచూస్తున్నా" అని పేర్కొన్నారు.



పుష్ప 2 కు బాలీవుడ్ దర్శకుడి ప్రశంసలు

'ఇప్పుడే 'పుష్ప 2' టీజర్ చూశా. అద్భుతంగా ఉంది. పుష్పరాజ్‌గా అల్లు అర్జున్ నటన నాకు బాగా నచ్చింది. ఆ సినిమా కోసం ఆత్రుతగా ఎదురు చూస్తున్నా'.. ఈ మాటలు అన్నది ఎవరో తెలుసా. బాలీవుడ్ దర్శకుడు అనిల్ శర్మ. 'గదర్ 2' చిత్రంతో సూపర్ హిట్ సాధించిన ఈ దర్శకుడు తన ప్రశంసలను కొనసాగిస్తూ 'గత ఏడాది ఆగస్టు 15న నా చిత్రం 'గదర్ 2' విడుదలై మంచి విజయం సాధించింది. ఈ ఏడాది అదే రోజున 'పుష్ప 2' రిలీజ్ అవుతోంది. ఇది కూడా తప్పకుండా హిట్ అవుతుంది. తెలుగు చిత్ర పరిశ్రమకు, ఈ సినిమా టీమ్‌కు నా అభినందనలు' అన్నారు.

ఐఫా వేదికపై శ్రీలీల మెరుపులు



చైల్డ్ ఆర్టిస్ట్‌గా సినీ రంగప్రవేశం చేసి అనతికాలంలోనే అగ్ర హీరోలతో జతకట్టే స్థాయికి చేరారు నటి శ్రీలీల. 'పెళ్లి సందడి', 'ధమాకా', 'స్కంద' 'గుంటూరు కారం', 'ఎక్స్‌ట్రార్డినరీ మ్యాన్' వంటి చిత్రాలతో వరుసగా సందడి చేసిన ఈ భామ జోరు ఇటీవల బాగా తగ్గింది. నటిగా కంటే మంచి డాన్సర్‌గా ఎక్కువ పేరు తెచ్చుకున్న ఈ నాజూకు భామకు ఇప్పుడు ఒక మంచి అవకాశం వచ్చింది. అయితే అది సినిమాలో కాదు. దుబాయ్‌లో సెప్టెంబరులో జరిగే ఐఫా ఉత్సవాలలో డాన్స్ పెర్ఫార్మెన్స్ ఇవ్వనున్నారు శ్రీలీల. మంచి డ్యాన్సర్‌గా పేరొందిన ఈ నటి ఐఫా వేదికపై తన మెరుపులతో ప్రేక్షకులను రంజింపచేయనున్నారు. అలాగే ఇటీవలే పెళ్లి చేసుకున్న రకుల్ ప్రీత్‌సింగ్ కూడా తన నృత్యంతో ప్రేక్షకుల మతిపోగొట్టడానికి సిద్ధమవుతున్నారు. ఇలా ఈ ఇద్దరు భామలు ఐఫా వేదికకు సరికొత్త అందం ఇవ్వనున్నారు. ఈ వేడుకలో రాక్‌స్టార్ దేవిశ్రీ ప్రసాద్ కూడా భాగం కానున్నారు. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవంలో.. తెలుగు వేడుకలకి దగ్గుబాటి రానా ..మిగతా విభాగాలకు అకుల్ బాలాజీ, విజయ్ రాఘవేంద్ర వాఖ్యాతలుగా వ్యవహరించనున్నారు.

ఘనంగా తమిళ దర్శకుడు
శంకర్ కుమార్తె వివాహం



ప్రముఖ దర్శకుడు ఎస్.శంకర్ - ఈశ్వరీ శంకర్‌ల కుమార్తె ఐశ్వర్య వివాహం తరుణ్ కార్తికేయన్‌తో జరిగింది. సోమవారం చెన్నైలో జరిగిన ఈ వివాహ వేడుకలో తమిళనాడు రాష్ట్ర ముఖ్యమంత్రి ఎం.కె స్టాలిన్ హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. అలాగే చలన చిత్ర ప్రముఖులు రజినీకాంత్, కమల్ హాసన్, సూర్య, కార్తి, విక్రమ్, విశాల్, అర్జున్, కీర్తి సురేశ్, దర్శకులు భారతీరాజా, మణిరత్నం - సుహాసిని దంపతులు, కె.భాగ్యరాజ్, పి.వాసు, కేఎస్ రవికుమార్, హరి, విష్ణువర్ధన్, విఘ్నేష్ శివన్ - నయనతార దంపతులు, నిర్మాతలు ఆర్బీ చౌదరి, జయంతిలాల్ గడ, ఏఎం రత్నం, దిల్ రాజు, ఐసరి కె.గణేశ్ తదితరులు హాజరయ్యారు.

చెన్నై (ఆంధ్రజ్యోతి)

నవ్వించడానికి సిద్ధం



'అల్లరి' నరేశ్ తన తాజా చిత్రం 'ఆ ఒక్కటీ అడక్కు'తో ఆకట్టుకోవడానికి సిద్ధమయ్యారు. మల్లి అంకం దర్శకుడిగా పరిచయమవుతున్న ఈ చిత్రాన్ని రాజీవ్ చిలక నిర్మించారు. వేసవి సెలవుల సందర్భంగా ఈ నాన్‌స్టాప్ ఎంటర్‌టైనర్‌ను మే 3న విడుదల చేయనున్నట్లు నిర్మాత ప్రకటించారు. ఏషియన్ సురేశ్ ఎంటర్‌టైన్‌మెంట్ సంస్థ రెండు తెలుగు రాష్ట్రాల్లో ఈ సినిమాను విడుదల చేస్తోంది. చాలా రోజుల తర్వాత మళ్లీ నరేశ్ పూర్తి స్థాయిలో ఫన్ క్యారెక్టర్ పోషించడంతో ఈ సినిమా కోసం అంతా ఎదురు చూస్తున్నారు. ఫరియా అబ్దుల్లా హీరోయిన్‌గా నటించిన ఈ సినిమాకు రచన: అబ్బూరి రవి, సంగీతం: గోపీసుందర్, ఛాయాగ్రహణం: సూర్య, సహ నిర్మాత: భరత్ లక్ష్మీపతి.

తెలుగులో తొలిసారి!



తెలుగులో సెటైరికల్ ఫిల్మ్‌ కొన్ని వచ్చాయి కానీ పొలిటికల్ సెటైరికల్ ఫిల్మ్‌ తక్కువ అనే చెప్పాలి. అందుకే ఈ తరహా కాన్సెప్ట్ ఎన్నుకొని ప్రేక్షకులను నవ్వించడానికి 'లక్ష్మీ కటాక్షం' చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా నుంచి డైలాగ్ పోస్టర్‌ను విడుదల చేశారు. సాధారణంగా రాజకీయ నాయకులు ఒక ఓటుకి ఇంత అని డబ్బు నిర్ణయిస్తుంటారు. కానీ ఈ డైలాగ్ పోస్టర్‌లో ఓటరే తన రేటుని నిర్ణయించడం విశేషం. ఇటువంటి కాన్సెప్ట్ తెలుగులో రావడం ఇదే తొలిసారి. ప్రస్తుతం జరుగుతున్న రాజకీయ పరిణామాలను ప్రతిబింబించేలా ఈ పోస్టర్ ఉంది. సూర్య దర్శకత్వంలో యు. శ్రీనివాసుల రెడ్డి నిర్మించిన ఈ చిత్రంలో సాయికుమార్ ముఖ్య పాత్ర పోషించారు. వినయ్, అరుణ్, దీప్తి వర్మ ఇతర ముఖ్య తారాగణం. తాడిపత్రి నేపథ్యంగా చిత్ర కథ ఉంటుందనీ, త్వరలో సరదాగా ఉండే టీజర్, ట్రైలర్‌ను విడుదల చేస్తామని దర్శకనిర్మాతలు చెప్పారు. ఈ చిత్రానికి సంగీతం: అభిషేక్ రుఫూస్, ఛాయాగ్రహణం: నాని ఐనవల్లి, నిర్మాతలు: యు.శ్రీనివాసుల రెడ్డి, బి.నాగేశ్వర రెడ్డి, వహీద్ షేక్, కె. పురుషోత్తం రెడ్డి.

'చిత్రజ్యోతి'లో మరిన్ని ఆసక్తికర కథనాల కోసం ఈ క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి. లేదా ఈ కింది యూఆర్ఎల్ https://ejyothy.com/2hcliJG లో చదవండి.

100 రోజులు... రూ. వంద కోట్లు



క్రికెట్‌లో సెంచరీ కొడితే ఆ ఆటగాడికి చెప్పలేనంత క్రేజ్.. ఫ్యాన్స్, మీడియా అతన్ని ఆకాశానికి ఎత్తేస్తాయి. అలాగే ఓ సినిమా రూ. వంద కోట్లు కలెక్ట్ చేస్తే ఆ చిత్ర బృందానికి వచ్చే కిక్కే వేరు. క్రికెట్‌లో ఆటగాడు సెంచరీ కొట్టాలంటే అది అతని ఒక్కడితోనే అయ్యే పని. కానీ సినిమా విషయం అలా కాదు. అది రూ.. వంద కోట్ల మైలురాయి చేరాలంటే దాని వెనుక చిత్ర బృందం కఠోర శ్రమ దాగి ఉంటుంది. ఈ ఏడాదిలో ఇప్పటివరకూ గడిచిన వంద రోజుల్లో ఈ డ్రీమ్ టార్గెట్‌ను అందుకున్న దక్షిణాది సినిమాల వివరాలు ఇవీ.

పూర్తి కథనం... ఈ-పేపర్‌లో...

ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం



'బిగ్ బాస్' ఫేం అర్జున్ అంబటి హీరోగా, కిశోరి ధాత్రిక్ హీరోయిన్‌గా నటించిన 'తెప్ప సముద్రం' చిత్రం ఈ నెల 19న విడుదల కానుంది. సతీశ్ రాపోలు దర్శకుడు. నీరుకంటి మంజులా రాఘవేందర్ గౌడ్ నిర్మాత. ఆదివారం రాత్రి ప్రసాద్ ప్రీవ్యూ థియేటర్‌లో జరిగిన ప్రీ రిలీజ్ కార్యక్రమంలో శాసన సభ్యుడు పైడి రాకేశ్ రెడ్డి సినిమాలోని మొదటి పాటను విడుదల చేశారు. ట్రైలర్‌ను జాతీయ బీసీ కమిషన్ మాజీ సభ్యుడు తల్లోజు ఆచార్య రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా చిత్ర నిర్మాత రాఘవేంద్ర గౌడ్ మాట్లాడుతూ 'ఒక సినిమా ప్రేక్షకుల ముందుకు రావాలంటే ఎందరో కష్టపడాలి. నేను చిరంజీవిగారి అభిమానిని. ఆయన స్ఫూర్తితోనే పరిశ్రమలోకి వచ్చాను. ప్రతి ఒక్కరూ ఎంజాయ్ చేసే విధంగా ఈ సినిమా ఉంటుంది.' అన్నారు. అర్జున్ అంబటి మాట్లాడుతూ 'చిన్న సినిమా అనగానే నిర్మాతకు, దర్శకుడికి ఎన్నో రకాల ఇబ్బందులు ఎదురవుతుంటాయి. మా నాన్న, పెద నాన్న డిస్ట్రిబ్యూటర్స్ కాబట్టి ఆ వేదన నాకు తెలుసు. ప్రతి ఒక్కరూ చిన్న సినిమాను బతికించాలని కోరుతున్నా. ఈ సినిమా 90 శాతం షూటింగ్ పోచంపల్లిలో జరిగింది' అని చెప్పారు. 'తెప్ప సముద్రంలో చిన్న పిల్లల మీద జరిగే అఘాయిత్యాలే కాకుండా కొన్ని ప్రత్యేక అంశాలు కూడా ఇందులో ఉన్నాయి. అవి థియేటర్‌లో చూస్తేనే బాగుంటుంది. ఇది చిన్న సినిమా కాదు.. కంటెంట్ ఉన్న చిత్రం' అని దర్శకుడు సతీశ్ చెప్పారు.



బిల్డ్ అమరావతి అంటూ వెంకటపాలెం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న మహిళలు

అమరావతిని అవమానించిన వారిని తరిమికొట్టాలి

● 1581వ రోజుకు చేరుకున్న రైతుల ఆందోళనలు

తుళ్ళూరు, ఏప్రిల్15: రాజధాని అమరావతిని భక్షించాలనుకునే వారిని రాష్ట్రం నుంచి తరిమి కొట్టాలని 33వేల ఎకరాలు భూములు త్యాగం చేసిన రైతులు పేర్కొన్నారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ అమరావతి రైతులు, మహిళలు, రైతు కూలీలు ధర్నా శిబిరాలు, ఇళ్ల వద్ద నుంచి చేస్తున్న ఆందోళనలు నిరసన దీక్షలు సోమవారం నాటికి 1581వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా పలువురు మహిళా రైతులు, రైతులు మాట్లాడుతూ గత టీడీపీ ప్రభుత్వంలో అమరావతి అభివృద్ధి పనులు దాదాపు రూ.9వేల కోట్లు జరిగాయన్నారు. వైసీపీ ప్రభుత్వం వచ్చిన తరువాత తట్ట మట్టి వేయలేదన్నారు. అమరావతిపై అబాండాలు, అసత్య ప్రచరాలు చేస్తూ నాశనం చేయాలని సీఎం జగన్‌రెడ్డి అండ్‌కో చూసిందన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి, జై ఆంధ్రప్రదేశ్ అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29గ్రామాల్లో భూములు ఇచ్చిన రైతుల ఆందోళనలు కొనసాగుతున్నాయి.

నాపై ఉంచిన నమ్మకాన్ని నిలబెడతా

● టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: తనపై నమ్మకంతో పల్నాడు జిల్లా అధ్యక్షుడుగా ఎంపిక చేసిన తెలుగుదేశంపార్టీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు, రాష్ట్ర అధ్యక్షుడు కింజారపు అచ్చెన్నాయుడు, జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్‌లకు టీడీపీ పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొమ్మాలపాటి శ్రీధర్ ఓ ప్రకటనలో హృదయపూర్వక ధన్యవాదాలు తెలిపారు. జిల్లా పరిధిలోని ఏడు శాసన సభ స్థానాల్లో తెలుగుదేశంపార్టీ అభ్యర్థులను, ఎంపీ అభ్యర్థిని అత్యధిక మెజారిటీతో గెలిపించి నారా చంద్రబాబునాయుడు శాసనసభ సాక్షిగా చేసిన ప్రతిజ్ఞ నెరవేరుస్తామన్నారు. పార్టీలో వివిధ హోదాల్లో ఉన్న నాయకులను, కార్యకర్తలను సమన్వయం చేసుకొని సమష్టిగా పార్టీ విజయానికి కృషి చేస్తామన్నారు. తనపై అభిమానంతో శుభాకాంక్షలు తెలియజేసిన పల్నాడు జిల్లా నాయకులకు కార్యకర్తలకు ప్రజలందరికీ పేరుపేరునా ధన్యవాదాలు తెలియజేశారు.

పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తాం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 15: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే పిరమలై కల్లర్ కులస్తులకు న్యాయం చేస్తామని మాజీమంత్రి, ప్రత్తిపాటి పుల్లారావు హామీ ఇచ్చారు. రాష్ట్రంలో లక్షకు పైగా జనాభా ఉన్న వారందరికీ 80 సంవత్సరాలు ఎదురుచూపులకు పరిష్కారం చూపిస్తామన్నారు. సోమవారం పట్టణంలోని వివేకానంద కాంప్లెక్స్‌లో జరిగిన తిరుమలై కల్లర్ కులస్తులతో ఆత్మీయ సమావేశంలో ప్రత్తిపాటితో పాటు స్థానిక ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడిన వారంతా తమిళనాడు నుంచి వచ్చి రాష్ట్రంలో సుమా రు 80 సంవత్సరాలుగా జీవిస్తు న్నామని, ఏపీ ప్రభుత్వం తమ కు కుల ధ్రువీకరణ పత్రాలు కూడా మంజూరుచేయటం లేద ని, పిల్లలను పాఠశాలలో చే ర్పించాలన్నా, సంక్షేమ పథకా లకు దరఖాస్తులు చేసుకోవాల న్నా గుర్తింపులేక ఇబ్బంది పడుతున్నామని వారు ప్రత్తి పాటి, లావు దృష్టిలకు తీసుకు వచ్చారు. ఎంపీ శ్రీకృష్ణ దేవరాయలు మాట్లాడుతూ రాబోయే కూటమి ప్రభుత్వంలో చంద్రబాబు ముఖ్యమంత్రి కాగానే మీకు తప్పకుండా న్యాయం చేస్తామని హామీ ఇచ్చారు.

అమరావతిలో.. అడుగడుగునా బ్రహ్మరథం

● రాజధాని గ్రామాలలో పెమ్మసాని , శ్రావణ్ ప్రచార హోరు

● వైసీపీ మండల అధ్యక్షుడు టీడీపీలో చేరిక



పెదపరిమిలో ప్రచారం చేసున్న ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్



ప్రచారంలో పాల్గొన్న రాజధాని గ్రామాల మహిళలు

తుళ్లూరు, ఏప్రిల్ 15: రాజధాని గ్రామాల్లో గుంటూరు టీడీపీ ఎంపీ అభ్యర్థి పెమ్మసాని చంద్రశేఖర్‌కు, ఎమ్మెల్యే అభ్యర్థి తెనాలి శ్రావణ్‌కుమార్‌కు ప్రజలు అడుగడుగునా బ్రహ్మరథం పట్టారు. పూలుజల్లి హారతులిచ్చారు. బాణాసంచా కాల్చి స్వాగతం పలికారు. సోమవారం పెదపరిమి, నెక్కల్లు, అనంతవరం, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాల్లో ఇద్దరు ప్రచారం నిర్వహించారు. అనంతవరంలో పలు వైసీపీ కుటుంబాలు టీడీపీలో చేరాయి. పెమ్మసాని పసుపు కండువాలు వేసి ఆహ్వానించారు. తొలుత పెదపరిమి ఆంజనేయస్వామి విగ్రహం వద్ద పూజలు నిర్వహించి ప్రచారం ప్రారంభించారు. తుళ్లూరు మండల వైసీపీ అధ్యక్షుడు మాదల మహేంద్రకు పెమ్మసాని, శ్రావణ్‌కుమార్‌లు టీడీపీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతవరంలో గ్రామస్తులు మధ్యాహ్న భోజనం పార్టీ శ్రేణులకు ఏర్పాటు చేశారు. అనంతరం వడ్డమాను, హరిశ్చద్రపురం, బోరుపాలెం, దొండపాడు గ్రామాలలో ప్రచారం జోరు కొనసాగింది. ఈ సందర్భంగా శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ, అమరావతిని ర క్షించుకోవాల్సి భాధ్యత ప్రతి ఒక్కరి పైన ఉందని స్పష్టం చేశారు. కోడి కత్తి, బాబాయి హత్య గతంలో ఎన్నికల ప్రచారంలో వాడుకొని సెంటిమెంట్ సీఎం జగన్‌రెడ్డి పండించారన్నారు. ప్రజలు నమ్మి మోసపోయారన్నారు. ఇప్పుడు సరికొత్తగా రాళ్ల దాడి ఘటన తెరమీదకు వచ్చిందన్నారు. ప్రతి పక్షంపై బురద జల్లే కార్యక్రమం జగన్‌రెడ్డి మొదలు పెట్టాడన్నారు. రాయి దాడిపై నిష్పక్షపాతంగా ఎక్వయరీ జరగాలన్నారు. ఒక్క ఛాన్స్ అని రాజధాని అమరావతి తో సహా రాష్ట్రాన్ని అధోగతి పాలు జేశారన్నారు. పెమ్మసాని చంద్రశేఖర్ మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు ఇవ్వటాన్ని ఎవరూ కాదనరు అన్నారు. పేదల జీవితాలు బాగుపడాలంటే రోజు వారి సంపాదన చూపించాలన్నారు. నెలకు రూ.50 వేలు సంపాదించే ఉపాధిని పేదలకు చూపాలన్నారు. అప్పుడే వారి జీవితాల్లో భరోసా నిండుకుంటుందన్నారు. అంతేకాని పావల సంక్షేమం ఇచ్చి, పన్నుల రూపంలో రూపాయి కాజేయటంతో పేదల జీవితాలు ఆర్థికంగా ఎలా ఎదుగుతాయని ప్రశ్నించారు. సూపర్ సిక్స్ పథకాలతో పేదలు సంపన్నులు అవుతారన్నారు. చంద్రబాబు సంక్షేమంతో పాటు పేదలకు నిరంతరం ఉపాధి చూపే నాయకుడన్నారు. అభివృద్ధిని పరుగులు పెట్టిస్తారని పెమ్మసాని పేర్కొన్నారు. నియోజకవర్గంలో 25వేల కిలలోమీటర్లు సిమెంట్ రోడ్డు టీడీపీ ప్రభుత్వంలో వేశామని చెప్పారు. ఈ వైసీపీ ప్రభుత్వం బడుగు, బలహీన వర్గాల దోచుకుంటూ ఉందన్నారు. టీడీపీకి ఓటు వేసి అమరావతిని రక్షించుకోవాలని కోరారు.

ఆయా గ్రామాల ప్రచార కార్యక్రమంలో మండల టీడీపీ అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, రాష్ట్ర టీడీపీ కార్యదర్శి దామినేని శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు యువత ఉపాధ్యక్షుడు పుట్టి రామచంద్రరావు, రైతు నాయకులు నూతలపాటి రామారావు, జనసేన మండల అధ్యక్షుడు ఎర్రగోపు నాగరాజు, బీజేపీ నాయకులు కంతేటి బ్రహ్మయ్య, సరిపూడి సాంబశివరావు, టీడీపీ నేతలు చుండు వెంకటరెడ్డి, పోతుగుంట నర్సయ్య, భాష్యం పెదశ్రీధర్, చిన శ్రీధర్, కర్నాటి శ్రీనివాసరావు, రావెల గోపాలకృష్ణ రామినేని చిన్నా, పోలు నర్సయ్య, జొన్నలడ్డ మధు, అనంతవరంలో గ్రామ టీడీపీ అధ్యక్షుడు బండ్ల సూరిబాబు, మద్దినేని రాంబాబు, గోరిజాల శ్రీనిసరావు, కాటా అప్పారావు, జమ్ముల అనిల్, సరిగల డేవిడ్, చిలకా బసవయ్య, తరిగోపుల సాంబశివరావు, వట్టికూటి బాబీ, మాజీ ఎంపీటీసీలు షైనేని గిరిజా, జొన్నలగడ్డ కిరణ్ పిన్నక సాంబశివరావు, జొన్నకూటి ఏడుకొండలు, పెదపరిమి, వడ్డమాను, హరిశ్చంద్రపురం, బోరుపాలెం, గ్రామాల టీడీపీ అధ్యక్షులు అత్తిపట్ల బాలయ్య, పుచ్చకాయల గిరి, కొమ్మినేని కోటేశ్వరావు, కట్టానరసింహరావు, జనసేన, బీజేపీ , టీడీపీ కార్యకర్తలు నాయకులు, మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. ఆయా గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు అభ్యర్థులు పూలదండలు వేసి నివాళి అర్పించారు.

పల్నాడును.. సస్యశ్యామలం చేస్తాం

● సాగర్ కుడికాలువను స్థిరీకరణ చేస్తాం

● ప్రతి ఇంటికి మంచినీటి కుళాయి అందిస్తా

● పిన్నెల్లి బాధితులను గుండెల్లో పెట్టుకుంటా

● ఆత్మగౌరవ సభలో ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు

మాచవరం, ఏప్రిల్ 15: పల్నాడు ప్రాంతంలో ఇప్పటికే వరికపూడిశల ప్రాజెక్టు మంజూరు చేయించానని, అదేవిధంగా 2024 ఎన్నికల అనంతరం కృష్ణానదిపై మూడు లిఫ్ట్ ఇరిగేషన్లు మంజూరు చేయించి పల్నాడు ప్రాంతాన్ని సస్యశ్యామలంగా తీర్చిదిద్దుతామని నరసరావుపేట ఎంపీ అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరా యలు పల్నాడు ప్రాంత ప్రజలకు హామీ ఇచ్చారు. మాచవరం మండలం పిన్నెల్లి గ్రామంలో జరిగిన ప్రజాగళం - ఆత్మగౌరవ సభకు ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకృష్ణదేవరాయలు మాట్లాడు తూ కొంతమంది అణగదొక్కాలని చూస్తున్నారని, దానికి రెండు రెట్లు వేగంతో నిప్పులు తొక్కుకుంటూ పైకి తెలుగుదేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు వస్తారనేదానికి నిదర్శనం పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనమని శ్రీకృష్ణదేవరాయలు తెలిపారు. పిన్నెల్లి గ్రామంలో 2019 ఎన్నికల తరువాత వైసీపీ నాయకులు చేసిన అరాచకాలు, అకృత్యాలకు టీడీపీ నాయకులు, కార్యకర్తలు ఊరు వదిలి వెళ్లాల్సిన పరిస్థితి ఏర్పడటమే కాకుండా భూములను బీడు భూములుగా మార్చారని ఆరోపించారు. పిన్నెల్లి వైసీపీ బాధితులను గుండెల్లో పెట్టుకొని చూసుకుంటానని వారికి హామీ ఇచ్చారు. ఎన్నికల అనంతరం ప్రతి ఇంటికి జలజీవన్ మిషన్ ద్వారా కుళాయి ఏర్పాటు చేస్తామని మహిళలకు హామీ ఇచ్చారు. సూపర్ సిక్స్ పథకాల్లో భాగంగా మాజీ ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు మూడు సిలిండర్లు ప్రకటిస్తే యరపతినేని శ్రీనివాసరావు ఒక సిలిండర్ ప్రకటించారన్నారు. ముఖ్యంగా మైనారిటీ సోదరులకు బీజేపీతో కలవడం వల్ల 4 శాతం రిజర్వేషన్‌కు ఇబ్బంది కలుగుతుందనే అపోహలో పడవద్దని, రిజర్వేషన్‌కు ఎలాంటి ఇబ్బంది వుండదని తేల్చిచెప్పారు. ఎస్సీ వర్గీకరణ చేసేందుకు కూడా బీజేపీ సంసిద్ధంగా వుందన్నారు. రాష్ట్రం బాగుపడాలనే ఉద్ధేశంతో బడుగు బలహీనవర్గాల ఆశాజ్యోతి జంగా కృష్ణమూర్తి రాష్ట్రవ్యాప్తంగా తిరిగితే వైసీపీ నేడు ఆయనకు తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. డబ్బు అనే అహంకారంతో కాసు మహేష్‌రెడ్డి వున్నాడని, ఎల్లప్పుడూ డబ్బు సమస్యకు పరిష్కారం కాదని హితవు పలికారు. పిన్నెల్లి సభకు వచ్చిన జన ప్రభంజనాన్ని చూసి శ్రీకృష్ణదేవరాయలు భావోద్వేగానికి గురయ్యారు.

అభివృద్ధి తప్ప కక్ష సాధింపు వుండదు : ఉమ్మడి అభ్యర్థి యరపతినేని

వైసీపీ పాలనలో పిన్నెల్లి రావణకాష్టంగా మారిందని గురజాల నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు తెలిపారు. సభలో మాట్లాడుతూ ఈ ఎన్నికలు ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డి అహంకారానికి.. టీడీపీ అభివృద్ధికి మధ్య జరిగేవని, 1994లో మొదటిసారి ఎమ్మెల్యేగా పిన్నెల్లి వచ్చినప్పుడు అప్పుడు అభివృద్ధి అంతంత మాత్రంగానే కనిపించిందని, టీడీపీ హయాంలోనే పిన్నెల్లిని ఎంతో అభివృద్ధి పథంలో మార్చుతెచ్చామన్నారు. ఐదేళ్ల వైసీపీ పాలనలో ఒక్క పిన్నెల్లిలోనే 40 మంది కాళ్లు, చేతులు విరగ్గొట్టి మహిళలపై అత్యాచారాలు, అక్రమ కేసులు పెట్టడం దారుణమన్నారు. అంతేకాకుండా ఎస్సీ ఎస్టీ బీసీ కాపు సామాజికవర్గానికి చెందిన 11మంది పార్టీ నాయకులు, కార్యకర్తలను ఎమ్మెల్యే కాసు మహేష్ రెడ్డి ప్రోద్భలంతో హత్యలు చేశారని, కాసు అక్రమ సంపాదన కోసం ముక్కుపచ్చలారని 8మంది చిన్నారులు బలయ్యారన్నారు.ప్రభుత్వ ఆస్తులను ఆక్రమించుకోవడమే కాకుండా ప్రైవేటువ్యక్తుల పొలాలను కూడా ఆక్రమించుకున్న వైసీపీ నేతలకు ఎమ్మెల్యే కాసు అండదండలు పుష్కలంగా వున్నాయన్నారు. పల్నాడులో మాకు మాకు మధ్య తగాదాలు పెట్టడం కాసు మహేష్‌రెడ్డికి తగదని, సంపాదనే కావాలంటే నావద్ద వున్నవి ఇస్తాను.. అవి కూడా చాలకపోతే జోలెపట్టి అయినా నీకు అందజేస్తానని, ఇకనైనా అక్రమ సంపాదన కోసం ఏ ఒక్కరిని బలి తీసుకోవద్దని యరపతినేని సూచించారు. నేను, జంగా కృష్ణమూర్తి ఎమ్మెల్యేలుగా వున్న సమయంలో పల్నాడు అభివృద్ధికి తపన పడ్డామే కానీ గొడవలు సృష్టించి పబ్బం గడుపుకోలేదన్నారు. నరసరావుపేట, హైదరాబాద్‌లో ఎమ్మెల్యే కాసు నిర్మిస్తున్న షాపింగ్ కాంప్లెక్స్ అంతా గురజాల సొమ్ముతోనే కాదా అని యరపతినేని ప్రశ్నించారు. రేపు రానున్న ప్రజా ప్రభుత్వంలో పిన్నెల్లి అభివృద్ధి కోసం 50 కోట్ల రూపాయలు కేటాయిస్తాను. 30 ఏళ్ల రాజకీయ జీవితంలో పిన్నెల్లి ఘటనలు నా మనసును ఎంతో కలచివేసిందన్నారు. ఉంటున్న ఊరు, కన్నతల్లిని వదిలి ఐదేళ్లు ఎక్కడెక్కడో వుండాల్సిన పరిస్థితి ఏ ఒక్కరికి రాకూడదన్నారు. నేను, ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, జంగా కృష్ణమూర్తిలు పిన్నెల్లిని అభివృద్ధి చేసి రోల్‌మోడల్‌గా తీర్చిదిద్దుతామని, రేపటి ఎన్నికలలో ప్రతిఒక్కరు సైకిల్ గుర్తుపై ఓటు వేయాలన్నారు.

యరపతినేని గెలుపు నల్లేరుమీద నడకే: జంగా కృష్ణమూర్తి

రాష్ట్రంలో వైసీపీ అధికారంలో వుందనే అహంకారంతో గురజాల ఎమ్మెల్యే కాసు మహేష్‌రెడ్డికి అహంకారం నెత్తికెక్కిందని ఎమ్మెల్సీ జంగా కృష్ణమూర్తి ఆరోపించారు. పల్నాడు ప్రాంతంలో ఎన్నడూ లేనివిధంగా అక్రమ మైనింగ్ ద్వారా కోట్లాది రూపాయలు అక్రమ సంపాదన చేసుకొని రానున్న ఎన్నికల్లో డబ్బుల సంచులతో గ్రామాలలోకి వస్తున్నారని, డబ్బులు వైసీపీ వారివద్ద తీసుకొని సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని ఓటర్లకు సూచించారు. ఒకప్పుడు యరపతినేని, నేను ప్రత్యర్థులమైనప్పటికీ పల్నాడు అభివృద్ధికే ప్రణాళికలు రూపొందించుకున్నాము తప్ప కక్షలు, కార్పణ్యాలను ప్రోత్సహించలేదన్నారు. నేడు మైనింగ్‌లకు గోరంత పర్మిషన్ తీసుకొని కొండంత దోపిడీ ఎమ్మెల్యే కాసు చేస్తున్నాడని ఆరోపించారు. వరికపూడిశల ప్రాజెక్టుకు ఎంపీ శ్రీకృష్ణదేవరాయలు అనుమతి తీసుకొచ్చారని, దాని ద్వారా పల్నాడు ప్రాంతం సస్యశ్యామలంగా మారనున్నదన్నారు. గత ఎన్నికలలో నా సీటు కాసు మహేష్ రెడ్డికి త్యాగం చేస్తే నా సొంత గ్రామంలో కూడా మాకు పనులు కాకుండా అధికారులపై ఒత్తిడి తెస్తారని ఆరోపించారు.

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపాం..

- తెలంగాణ రాష్ట్ర టీడీపీ ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి

తెలంగాణలో ముక్కోడిని ఇంటికి పంపామని.. ఏపీలో తిక్కోడిని కూడా మీరందరూ ఇంటికి పంపాలని తెలంగాణ టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి నన్నూరి నర్సిరెడ్డి తెలిపారు. పిన్నెల్లిలో జరిగిన సభలో ఆయన మాట్లాడుతూ పరదాల మాటున ఐదేళ్ల గడిపిన జగన్‌రెడ్డి రేపటి ఎన్నికల తరువాత పూర్తిగా ఇంటికే పరిమితమవుతారన్నారు. 2014లో నాన్న లేడని.. 2019లో చిన్నాన్న లేడని... 2024లో తల్లీ, చెల్లీ లేరని నర్సిరెడ్డి వ్యాఖ్యానించారు. గంజాయి, అక్రమ సంపాదన, కౌలు రైతుల ఆత్మహత్యలు, మహిళలపై అత్యాచారాలతో రాష్ట్రం మొదటి రెండు స్థానాలలో నిలిచిందన్నారు. జగన్‌కు రేపటి ఎన్నికలలో ఓటమి ఖాయమేనని నర్సిరెడ్డి తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర మహిళా ప్రధాన కార్యదర్శి కర్నాటి వరలక్ష్మీ, జనసేన గురజాల నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, డాక్టర్ పున్నం నాగమల్లిఖార్జునరావు, మైనారిటీ సెల్ జిల్లా అధ్యక్షులు అమీర్‌అలీ, మండల పార్టీ అధ్యక్షులు బడిగుంచల వెంకటేశ్వర్లు, దున్నా చెన్నయ్య చౌదరి, యడ్లపల్లి రామారావు, జమ్మిగుంపుల వెంకటేశ్వర్లు, కొల్లి కృష్ణమూర్తి, మాజీ సర్పంచ్ చింతపల్లి నన్నే, తాళ్లూరి అమర్‌నాథ్, యరవెద రామిరెడ్డి, పలు గ్రామాల దేశం పార్టీ నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



పావురాళ్లను ఎగురవేస్తున్న యరపతినేని, శ్రీకృష్ణదేవరాయలు, జంగా, నర్సిరెడ్డి తదితరులు



సభకు హాజరైన కార్యకర్తలు, అభిమానులు

18న లావు శ్రీకృష్ణదేవరాయలు నామినేషన్



శ్రీకృష్ణదేవరాయలు డాక్టర్ అరవిందబాబు

నరసరావుపేట, ఏప్రిల్ 15: నరసరావుపేట లోక్‌సభ టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి అభ్యర్థి లావు శ్రీకృష్ణదేవరాయలు, నరసరావుపేట అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ చదలవాడ అరవిందబాబు గురువారం నామినేషన్ దాఖలు చేయనున్నారు. కలెక్టరేట్ లోని పార్లమెంట్ నియోజకవర్గ ఆర్వో కార్యాలయంలో శ్రీకృష్ణదేవరాయలు, ఆర్డీవో కార్యాలయంలో అసెంబ్లీ అభ్యర్థి డాక్టర్ అరవిందబాబు నామినేషన్ దాఖలు చేస్తారు. ఈ సందర్భంగా పట్టణంలో భారీ ర్యాలీ నిర్వహించనున్నారు. నామినేషన్ కార్యక్రమానికి భారీగా కూటమి శ్రేణులు తరలివచ్చేలా ఏర్పాట్లు చేస్తున్నారు.

211 పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యక్ష ప్రసారం

● ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్



రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్

మాచర్ల రూరల్, ఏప్రిల్ 15: నియోజకవర్గంలోని 211 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ ప్రత్యేక్ష ప్రసారం ద్వారా ఓటింగ్ జరుగుతుందని ఎన్నికల రిటర్నింగ్ అధికారి శ్యాంప్రసాద్ అన్నారు. సోమవారం పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. నియోజకవర్గ పరిధిలోని 299 పోలింగ్ కేంద్రాలుండగా ఆయా చోట్ల ప్రత్యేక ఏర్పాటు చేశామన్నారు. అసెంబ్లీ, పార్లమెంట్‌కు సంబంధించి ఈవీఎంలు అదనంగా 40 శాతం తీసుకొచ్చామన్నారు. విజయపురిసౌత్ చెక్‌పోస్టు వద్ద ఆదివారం రూ.లక్ష పట్టుకున్నామని చెప్పారు. సోమవారం కూడా రూ.4.50 లక్షలు పట్టుకున్నట్లు తెలిపారు. ఈవీఎంలను పట్టణంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో భద్రపరిచామని, సీసీ కెమెరాల పర్యవేక్షణలో నిరంతర నిఘా ఉంటుందని అన్నారు. నియోజకవర్గంకు సంబంధించి వేరే రాష్ట్రాల్లో పనిచేస్తున్న 110 మందికి ఆన్‌లైన్ ద్వారా పోస్టల్ బ్యాలెట్ పంపిస్తున్నామని, కౌంటింగ్ రోజున ఉదయం 7 గంటలకల్లా మాకు అందితే ఓట్లు లెక్కిస్తామని అన్నారు. ఎన్నికల విధులు అతిక్రమించిన 8మంది ఉద్యోగులపై చర్యలు తీసుకున్నామన్నారు. ఈనెల 19వ తేదీన ప్రధాన అభ్యర్థులు నామినేషన్ వేసేందుకు అవకాశం ఉందని, ఎవరికీ ర్యాలీ నిర్వహించేందుకు అనుమతి ఇవ్వలేదని చెప్పారు. ఆయన వెంట మున్సిపల్ కమిషనర్ వెంకటదాసు, ఎలక్షన్ డీటీ బాషా తదితరులు ఉన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.4.04 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	130, 139,150
చికెన్ విత్ స్కిన్	248.00
చికెన్ స్కిన్ లెస్	258.00

ప్రతి ఇంటికి మంచి నీరు అందిస్తాం..

● ఎత్తిపోతల పథకాల ద్వారా సాగు నీరు అందిస్తాం ● ఎంపీ లావు శ్రీ కృష్ణదేవరాయలు



తాళ్ళచెరువులో టీడీపీ నాయకులతో మాట్లాడుతున్న ఎంపీ లావు శ్రీ కృష్ణ దేవరాయలు, పక్కన భాష్యం ప్రవీణ్ తదితరులు

అచ్చంపేట, ఏప్రిల్ 15: ఇంటింటికీ వెళ్ళి సూపర్ సిక్స్ పథకాలను ప్రచారం చేయాలని నరసరావుపేట పార్లమెంట్ సభ్యుడు లావు శ్రీ కృష్ణ దేవరాయలు అన్నారు. సోమవారం తాళ్ళచెరువు గ్రామంలో మండల పార్టీ అధ్యక్షుడు నందిగం ఆశీర్వాదం అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ఎంపీ శ్రీ కృష్ణదేవరాయలు మాట్లాడుతూ జల జీవన్ మిషన్ ద్వారా ప్రతి ఇంటికి మంచినీరు అందిస్తానని తెలిపారు. ఎత్తిపోతల పథకాలు మూలన పడ్డాయని, ఎన్నికల అనంతరం వాటికి మరమ్మత్తులు చేపట్టి వందలాది ఎకరాలు సాగులోకి తీసుకు వస్తాన న్నారు. వైసీపీ ప్రభుత్వంలో రద్దయిన 27 సంక్షేమ పథకాలు మళ్ళీ పునర్దురించి ఎస్సీల అభ్యున్నతికి బాటలు వేస్తానని ఎంపీ తెలిపారు. అధికారంలోకి రాగానే అర్హులైన వారికి రెండు సెంట్ల నివేశన స్థలంతో పాటు ప్రభుత్వం గృహం కూడా మంజూరు చేస్తామన్నారు. బీసీ డిక్లరే షన్ ద్వారా బీసీల అభివృద్ధి జరుగుతుందన్నారు. అనంతరం భాష్యం ప్రవీణ్ మాట్లాడుతూ ఎస్సీ కాలనీల్లో ఎస్సీ వర్గీకరణ గురించి వివరిం చాలని నాయకులకు సూచించారు. నియోజకవర్గంలోని సాగు, తాగు నీరు సమస్యలను పరిష్కరిస్తామన్నారు. పార్టీ కోసం కష్టపడి పని చే యాలని, బూత్ లెవల్ కమిటీలు జాగ్రత్త వహించాలన్నారు. సమష్టిగా పనిచేసి సూపర్ సిక్స్ పథకాలను ప్రజలకు వివరించాలని కోరారు. సమావేశంలో గ్రామపార్టీ అధ్యక్షుడు గాదె ఇన్నారెడ్డి, వెన్నా సాంబశివా రెడ్డి, నల్లమేకల వెంకటేశ్వర్లు, రామకృష్ణ, వెంగళరెడ్డి, మద్దిరాల గంగా ధర్ తదితరులు పాల్గొన్నారు.

● మండలంలోని నీలేశ్వరపాలెం గ్రామంలో సర్పంచ్ రామావత్ కోటేశ్వర నాయక్ తన అనుచరులతో తెలుగుదేశం పార్టీలో చేరారు. పది కుటుంబాల వారు కండువాలు కప్పుకున్నారు. రానున్న రోజుల్లో మరింత మంది పార్టీలోకి వస్తారని కోటేశ్వరరావు నాయక్ తెలిపారు.

పాత టైర్ల ఫ్యాక్టరీలో భారీ అగ్నిప్రమాదం



దగ్ధమవుతున్న పాత టైర్ల ఫ్యాక్టరీ

నాదెండ్ల, ఏప్రిల్ 15: చిలకలూరిపేట రూరల్ మండల పరిధిలోని అప్పాపురం డొంక పక్కన తిరుమల పాలిమర్ ప్రొడక్ట్ కంపెనీ ఫ్యాక్టరీలో సోమవారం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. ఈ అగ్ని ప్రమాదంలో సుమారు కోటి రూపాయలకు పైగా ఆస్థి నష్టం సంభవించినట్టు అంచనా. పక్కనే పొలాల్లోని రైతులు పత్తి కట్టెను తగల బెట్టడంతో నిప్పు రవ్వలు ఎగసి పడి ఈ టైర్ల ఫ్యాక్టరీకి అంటుకున్నాయి. మంటలు తీవ్రంగా ఎగసి పడటంతో రెండు గోడౌన్‌లు పూర్తిగా అగ్నికి ఆహుతయ్యాయి. చిలకలూరిపేట, నరసరావుటలకు చెందిన అగ్నిమాపక సిబ్బంది అక్కడికి చేరుకొని మంటలను అదుపులోకి తీసుకు వచ్చారు. సంఘటనా స్థలాన్ని పల్నాడు జిల్లా అగ్నిమాపక శాఖ అధికారి ఎస్.శ్రీధర్ సందర్శించారు. చిలకలూరిపేట, నరసరావుపేట ఎస్ఎఫ్‌వోలు ఎస్.కిరణ్ కుమార్‌రెడ్డి, సుబ్బారావు ఆధ్వర్యంలో రాత్రి వరకు మంటలను ఆర్పుతూనే ఉన్నారు. చిలకలూరిపేట రూరల్ పోలీసులు సంఘటనా స్థలాన్ని సందర్శించారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన ఎస్పీ

రొంపిచర్ల, ఏప్రిల్ 15: మండలంలోని పలు గ్రామాల్లోని పోలింగ్ కేంద్రాలను ఎస్పీ బిందుమాధవ్ సోమవారం పరిశీలించారు. గోగుల పాడు, అలవాల గ్రామాల్లోని 41, 42, 43, 44, 45 పోలింగ్ కేంద్రాలను పరిశీలించారు. ఆయా గ్రామాల్లోని ప్రజలతో మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో ఎటువంటి ఘర్షణలకు తావు ఇవ్వకుండా ప్రశాంతంగా ఓటుహక్కును వినియోగించుకోవాలని పేర్కొన్నారు. ఏమైనా సమస్య లు ఉంటే పోలీసులకు తెలియజేయాలని పేర్కొన్నారు. ఘర్షణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆయన వెంట డీఎస్పీ వర్మ, సీఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ రవీంద్రలు ఉన్నారు.



అలవాలలోని పోలింగ్ కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఎస్పీ బిందు మాధవ్

1,22,620 మిర్చి టిక్కీల అమ్మకం

గుంటూరు, ఏప్రిల్ 15 (ఆంధ్రజ్యోతి): మిర్చియార్డుకు సోమవారం 1,32,603 మిర్చి టిక్కీలు విక్రయానికి రాగా అందులో 1,22,620 అమ్మకం జరిగినట్లు గుంటూరు వ్యవసాయ మార్కెట్ కమిటీ జాయింట్ డైరెక్టర్ కాకుమాను శ్రీనివాసరావు తెలిపారు. ఇంకా యార్డు ఆవరణలో 84,395 మిర్చి టిక్కీలు నిల్వ ఉన్నట్లు పేర్కొన్నారు. వివిధ రకాల మిరపకాయలకు ధరలు ఈ కింది విధంగా నమోదయ్యాయి.

వెరైటీ	కనిష్ఠధర	గరిష్ఠధర
నాన్ ఏసీ కామన్ వెరైటీ		
334	8000	17500
నెంబరు. 5	8500	15000
273	9500	14000
341	9000	15000
4884	8500	13000
సూపర్ 10	9000	13000
నాన్ ఏసీ స్పెషల్ వెరైటీ		
తేజ	8000	19500
బ్యాడిగి	8000	14500
దేవనూరు డీలక్స్	8000	14500
తెల్లకాయలు	5000	11000

పల్నాడు వార్తలు

మాచర్ల ◆ గురజాల ◆ సత్తెనపల్లి ◆ పెదకూరపాడు



కజ్జం సైదయ్యను పార్టీలోకి ఆహ్వానిస్తున్న జూలకంటి బ్రహ్మారెడ్డి

వ్యాపారవర్గాలకు అండగా టీడీపీ

- మాచర్ల కూటమి అభ్యర్థి బ్రహ్మారెడ్డి
- నియోజకవర్గంలో విస్తృతంగా ఎన్నికల ప్రచారం..

మాచర్లటౌన్, ఏప్రిల్ 15: రాష్ట్రంలోని వ్యాపారవర్గాలకు టీడీపీ అండగా ఉంటుందని కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని 17వ వార్డులో ఇంటింటికి తిరిగి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. బ్రహ్మారెడ్డికి మహిళలు హారతులిచ్చి స్వాగతం పలికారు. బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ కూటమి అధికారంలోకి వచ్చిన వెంటనే చేపట్టే పలు సంక్షేమ పథకాలను వివరించారు. వ్యాపారస్తులకు ఊతమిచ్చే విధంగా పలు కార్యక్రమాలు అమలు చేస్తామని హామినిచ్చారు. కార్యక్రమంలో కొమెర దుర్గారావు, కేశవరెడ్డి, యాగంటి మల్లికార్జునరావు, నక్షత్రపు ప్రసాద్, ఓర్సు క్రాంతికుమార్, మాచర్ల వాసు, చిన్ని కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

30 కుటుంబాలు వైసీపీ నుంచి టీడీపీలో చేరిక

జూలకంటి బ్రహ్మారెడ్డి సమక్షంలో 17వ వార్డుకు చెందిన 30 వైసీపీ కుటుంబాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నాయి. కజ్జం సైదయ్యతోపాటు మరో 15 కుటుంబాలు సోమవారం వైసీపీ నుంచి టీడీపీలో చేరారు. అలాగే జగడాల శ్రీనివాస్ ఆధ్వర్యాన మాచర్ల మండలం రాయవరంకు చెందిన 15 ఎస్సీ కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి. వీరికి బ్రహ్మారెడ్డి పార్టీ కండువాను కప్పి సాదరంగా ఆహ్వానించారు. కార్యక్రమంలో యెనుముల కేశవరెడ్డి, మురళి, తిక్కా కొండలు, బొట్టు కోటేశ్వరరావు, కొమెర అనంతరాములు, పేరువాల పుల్లారావు, నర్రా గురవారెడ్డి, సంబోజు వేణు తదితరులు పాల్గొన్నారు.

సలోమాన్ కుటుంబానికి రూ.50 లక్షలు అందజేయాలి..

మాచర్ల పట్టణంలో ఆదివారం రాత్రి క్రేన్ తగిలి మృతి చెందిన సలోమాన్ కుటుంబానికి ఎమ్మెల్యే పిన్నెల్లి రూ.50 లక్షలు నష్టపరిహారం ఇవ్వాలని జూలకంటి బ్రహ్మారెడ్డి డిమాండ్ చేశారు. ప్రభుత్వ వైద్యశాల మార్చురీలో ఉంచిన ఆలేటి సలోమాన్ మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించారు. సలోమాను కుటుంబానికి అండగా ఉంటామని, పిల్లలను చదివించే బాధ్యత పార్టీ తీసుకుంటుందన్నారు. ఆయన వెంట గుండు కృష్ణమూర్తి, దుర్గారావు ఉన్నారు.

రెంటచింతల మండల గ్రామాల్లో హోరెత్తిన ప్రచారం ..

రెంటచింతల : కూటమి అభ్యర్థి జూలకంటి బ్రహ్మారెడ్డి సోమవారం రాత్రి మండలంలోని పాలువాయిగేటు, కొత్తపాలువాయి, పాతపాలువాయి, పశర్లపాడు తదితర గ్రామాల్లో విస్తృతంగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. రాష్ట్రంలోనూ, నియోజకవర్గంలోనూ కూటమి గెలుపు ఆవశ్యకతను ప్రజలకు వివరించారు. ముందుగా ఆయా గ్రామాల్లో ప్రజలు బ్రహ్మా రెడ్డికి హారతులు, బాణాసంచా, భారీ గజమాలలతో ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ మీరు చూపిస్తున్న అభిమానాన్ని మాటల్లో చెప్పలేనని, చివరి రక్తపు బొట్టు వరకు మీతోనే ఉంటానని అన్నారు. అనంతరం సుమారు 41 కుటుంబాల వారు వైసీపీని వీడి బ్రహ్మారెడ్డి సమక్షంలో టీడీపీలో చేరారు.

10 అంశాలతో మాచర్ల మేనిఫెస్టో విడుదల..

పశర్లపాడు గ్రామంలో నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో బ్రహ్మారెడ్డి 10 అంశాలతో కూడిన మాచర్ల మేనిఫెస్టోను (ఎన్నికల ప్రణాళిక) విడుదల చేశారు. మాచర్ల ప్రభుత్వ ఆస్పత్రిని 100 పడకలకు పెంచడం, వరికపూడిశెల పూర్తి చేయడం, బుగ్గవాగు రిజర్వాయర్ (3300 ఎకరాల్లో వుంది) నీటి నిల్వ 4.5టీఎంసీలకు పెంచడం, ఇంటింటికి నీటి కుళాయి కనెక్షన్, యువతకు ఉపాధి, మహిళా సాధికారత, ఇంటివద్దకే రేషన్, రూ.4 వేల పెన్షన్, వలంటీర్లకు రూ.10 వేల వేతనం, ప్రతి పేదవానికి 2 సెంట్ల నివేశనా స్థలంతో పక్కా గృహనిర్మాణం, కార్మికులకు అండగా, రైతన్నకు తోడుగా వివిధ పథకాలను ప్రవేశపెడతామన్నారు. కార్యక్రమంలో కావూరి నాగయ్య, మాజీ డీసీ చైర్మన్ నరసింహారావు, మాజీ సర్పంచ్ వెంకటనారాయణ, శివనాగు, పుల్లయ్య, దావీదు, సీతారాములునాయక్, చినరాములు, దస్రూనాయక్,బాలసైదులు,బ్రహ్మయ్యమధుమేస్త్రిలతో పాటు టీడీపీ మండల అధ్యక్షులు అబ్బిరెడ్డి,మాజీ మండల పరిషత్ మాజీ ఉపాధ్యక్షులు సుమంత్‌రెడ్డి,బోడపాటి రామకృష్ణ,చేర్రెడ్డి కృష్ణారెడ్డి,కాయితి రవి కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజిక వర్గీయులతో యరపతినేని

యరపతినేని సమక్షంలో టీడీపీలోకి చేరికలు

పిడుగురాళ్ల, ఏప్రిల్ 15: పట్టణంలోని 31, 32 వార్డులకు చెందిన ఎస్సీ, ఎస్టీ, బీసీ సామాజికవర్గానికి చెందిన 50 కుటుంబాల వారు సోమవారం గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావు సమక్షంలో వైసీపీని వీడి టీడీపీలో చేరారు. వారికి యరపతినేని పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు మల్లెల ఆదినారాయణ, బత్తుల శ్రీను పాల్గొన్నారు.

ప్రైవేటు ఎలక్ట్రీషియన్ల సమస్యలు పరిష్కరించాలి

పట్టణ ప్రైవేటు ఎలక్ట్రీషియన్, ప్లంబర్ వర్కర్స్ అసోసియేషన్ నేతలు సోమవారం గురజాల ఉమ్మడి అభ్యర్థి యరపతినేని శ్రీనివాసరావును కలిశారు. మేస్త్రీలు, వర్కర్స్ ఎదుర్కొంటున్న సమస్యలను యరపతినేని దృష్టికి తీసుకొచ్చారు. ఇల్లులేని వారికి ఇల్లు అందించడంతో పాటు సొంతింటి కలను నెరవేర్చే విధంగా చూడాలని యూనియన్ అధ్యక్షుడు ఢీకొండ రవికుమార్, ఉపాధ్యక్షుడు ఎం.రాజేంద్రప్రసాద్‌లు యరపతినేనిని కోరారు. రాబోయే కూటమి ప్రజా ప్రభుత్వంలో ప్రైవేటు ఎలక్ట్రీషియన్ వర్కర్స్ ఎదుర్కొంటున్న అనేక రకాల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించడంతో పాటు సొంతిల్లు లేనివారందరికీ ఇల్లు నిర్మించి ఇస్తామని యరపతినేని భరోసా ఇచ్చారు సమావేశంలో షేక్ మహబూబ్ సుభాని, నాగరాజు, జాన్‌సైదా, పాల్గొన్నారు.





ఆదర్శప్రాయ పాలన అందిస్తా..

- వన్నాయపాలెం గ్రామాన్ని అన్నివిధాలా తీర్చిదిద్దుతా
- బీసీలు డిక్లరేషన్ ప్రకటించిన ఘతన చంద్రబాబుదే..
- పెదకూరపాడు కూటమి అభ్యర్థి భాష్యం ప్రవీణ్



వన్నాయపాలెంలో ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న భాష్యం ప్రవీణ్

బెల్లంకొండ, ఏప్రిల్ 15 : 'ఒక్కసారి ఆదరించండి.. ఆదర్శప్రాయమైన పాలనను అందిస్తాను' అని పెదకూరపాడు నియోజకవర్గ కూటమి అభ్యర్థి భాష్యంప్రవీణ్ ఓటర్లను అభ్యర్థించాడు. సోమవారం బెల్లంకొండ మండలంలోని వన్నాయపాలెం గ్రామంలో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టీడీపీ మైనార్టీ సెల్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీఎస్‌కే మస్తాన్ షరీఫ్, మండల అధ్యక్షుడు లక్ష్మీనారాయణలు స్థానిక నేతలతో కలసి ముందుగా ప్రవీణ్‌కు డప్పుల దరువులతో, బాణాసంచాతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించి ప్రచారాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ వన్నాయపాలెం గ్రామాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దుతానని ప్రజలకు హామీనిచ్చారు. ఆంధ్ర రాష్ట్రం అభివృద్ధి చెందాలంటే కూటమి అధికారంలోకి వచ్చి, టీడీపీ అధినేత చంద్రబాబు సీఎం కావాలని అన్నారు. సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా చంద్రబాబు పాలన అందిస్తారని అన్నారు. 2019 ఎన్నికల ముందు కోడి కత్తి, బాబాయి హత్య డ్రామాలు చేసి సీఎం ఐన జగన్‌రెడ్డి ఇప్పుడు గులకరాయి డ్రామాకు తెరలేపారని ఎద్దేవాచేశారు. ఎన్ని డ్రామాలు ఆడినా రాష్ట్ర ప్రజలు ఇక నమ్మరని, మే 13న జరిగే ఎన్నికల్లో కూటమి ఘన విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. గ్రామంలో బీసీలు అధికంగా ఉన్నారని, బీసీలకు డిక్లరేషన్ ప్రకటించిన ఘనత చంద్రబాబుదేనన్నారు. గ్రామాన్ని అభివృద్ధి చేసేందుకు తనకు ఒక అవకాశం ఇవ్వాలని కోరారు. టీడీపీ మేనిఫెస్టోలోని అంశాలను ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు సురేష్, చెన్నుబోయిన శ్రీనివాస్, రామారావు, వెంకటేశ్వర్లు, శంకర్, జ్యోతి సముద్రం, గుంజా గంగారావు, సయ్యద్ జానీ, అక్కల వెంకట రామిరెడ్డి, వెన్నా సీతారామిరెడ్డి, వెంకటరెడ్డి, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

కోనూరు గ్రామంలోని 20 కుటుంబాల వారు టీడీపీలో చేరిక..

అచ్చంపేట: మండలంలోని కోనూరు గ్రామంలోని వైసీపీకి చెందిన 20 కుటుంబాలు సోమవారం భాష్యం ప్రవీణ్ సమక్షంలో టీడీపీలో చేరాయి. పెదపాలెం గ్రామంలో నిర్వహించిన ఓ కార్యక్రమంలో భాష్యం ప్రవీణ్ వారికి కండువాలుకప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు నందిగం ఆశీర్వాదం, వాసిరెడ్డి రవి, ఆవుల గురునాథం, తాళ్ళూరి లక్ష్మీనారాయణ, అచ్యుత రామారావు, శాఖమూరి శ్రీనివాసరావు, చింతపల్లి తిరుపతిరావు తదితరులు పాల్గొన్నారు.

అత్తలూరులో భాష్యం ప్రవీణ్ ఎన్నికల ప్రచారం

అమరావతి : మండల పరిధిలోని అత్తలూరు, ఎన్‌వీ పాలెంలో సోమవారం భాష్యం ప్రవీణ్ తన ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించారు. ముందుగా ఎన్‌వీ పాలెంలో ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం గ్రామస్థులతో మాట్లాడుతూ పెదకూరపాడు అసెంబ్లీ అయిన తనను నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థి లావు శ్రీకృష్ణ దేవరాయలను అత్యధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వెన్నా సాంబశివారెడ్డి, పఠాన్ నూర్జహాన్‌తో పాటు స్థానిక నేతలు పలువురు పాల్గొన్నారు.

క్రోసూరు: మండలంలోని ఉయ్యందన గ్రామంలో బాష్యం ప్రవీణ్ సతీమణి లావణ్య, మరదలు దీప్తిలు ఎన్నికల ప్రచారం నిర్వహించారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ప్రజలకు అందించే పథకాలు, ప్రయోజనాలను వివరిస్తూ ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేశారు. మహిళలు ఆర్థికంగా ఎదగాలన్నా, స్వయం సమృద్ధి సాధించాలన్నా టీడీపీ అధికారంలోకి రావాలని, చంద్రబాబు ముఖ్యమంత్రి కావాలని అన్నారు. సైకిల్ గుర్తుపై ఓటు వేసి ఎమ్మెల్యే అభ్యర్థిగా నియోజకవర్గ టీడీపీ అభ్యర్థి భాష్యం ప్రవీణ్‌ను, నరసరావుపేట పార్లమెంట్ అభ్యర్థిగా లావు శ్రీకృష్ణ దేవరాయలను గెలిపించాలని ఆమె కోరారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఏపూరి నాగేశ్వరరావు, సొసైటీ మాజీ ప్రెసిడెంట్ నీలం రామారావు, మాజీ సర్పంచ్ ఏపూరి రామకోటేశ్వరరావు, పలువురు టీడీపీ నాయకులు పాల్గొన్నారు.



వైసీపీని వీడి టీడీపీలో చేరిన కోనూరు గ్రామస్థులతో భాష్యం ప్రవీణ్



అమరావతి మండలంలో ప్రచారం నిర్వహిస్తున్న భాష్యం ప్రవీణ్

పిన్నెల్లిలో టీడీపీ బహిరంగసభ సక్సెస్

- టీడీపీ నాయకుల్లో నూతనోత్సాహం

మాచవరం, ఏప్రిల్ 15: ఐదేళ్ల తర్వాత పిన్నెల్లి గ్రామంలో టీడీపీ నాయకుల ఆధ్వర్యంలో సోమవారం నిర్వహించిన బహిరంగసభ సక్సెస్ అయింది. వైసీపీ అధికారంలోకి వచ్చాక పిన్నెల్లి గ్రామంలో టీడీపీకి చెందిన ఎస్సీ కుటుంబాలపై వైసీపీ శ్రేణులు దాడులు, అక్రమ కేసులు, మహిళలపై అత్యాచారాలకు పాల్పడ్డారు. వారికి పోలీసులు సహకరించారు. దీంతో ఎస్సీ కుటుంబాలు గ్రామాన్ని వదిలి వెళ్లాయి. ఇటీవల హైకోర్టు ఆదేశాల మేరకు ఊరు వదిలివెళ్లిన పిన్నెల్లి వాసులు గ్రామంలోకి వచ్చారు. కొద్దిరోజుల్లో సార్వత్రిక ఎన్నికలు జరుగనున్న నేపథ్యంలో టీడీపీ శ్రేణులు గ్రామంలో సభ నిర్వహించగా ఆయా గ్రామంలోని వైసీపీ బాధితులు భారీసంఖ్యలో ఆ సభకు హాజర య్యారు. అన్ని గ్రామాల ముఖ్యనేతలు సమావేశంలో పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరా నిలిపివేత... పిన్నెల్లిలో సభ నిర్వహిస్తుండగా పలుమార్లు విద్యుత్‌సరఫరాకు అంతరాయం ఏర్పడింది. బహిరంగసభ విజయవంతం కాకుండా చేయాలనే ఉద్దేశం తో వైసీపీ నేతలు విద్యుత్ సరఫరాను నిలిపివేయించారని టీడీపీ నేతలు మండిపడ్డారు.

టీడీపీ రాష్ట్ర కార్యదర్శులుగా

అంజయ్య, రామాంజినేయరెడ్డి



పంగులూరి అంజయ్య



కే. రామాంజినేయరెడ్డి

మాచర్లటౌన్, ఏప్రిల్ 15: టీడీపీ రాష్ట్ర కార్యదర్శులుగా కారంపూడి మండలం చింతపల్లికి చెందిన పంగులూరి అంజయ్య, వెల్దుర్తి మండలం శిరిగిరిపాడుకు చెందిన కళ్లం రామాంజినేయరెడ్డిలు నియమితుల య్యారు. ఈమేరకు టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు అచ్చెన్నాయుడు నియామక ఉత్తర్వులు పంపించారు. ఈ సందర్భంగా వారు టీడీపీ మాచర్ల నియోజకవర్గ ఇన్‌చార్జి జూలకంటి బ్రహ్మారెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. పార్టీ అధికారంలోకి వచ్చేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. వీరి ఎన్నిక పట్ల టీడీపీ నేతలు పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

వలంటీర్లు రాజీనామా

మాచర్ల రూరల్, ఏప్రిల్ 15: మండలంలోని రాయవరంకు చెందిన 19 మంది వలంటీర్లు సోమవారం రాజీనామా చేసి ఆయా పత్రాలను పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీడీవో సరోజినిదేవికి అందించారు. వివిధ గ్రామాలకు చెందిన 81 మంది వలంటీర్లు తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవోకు అందించారు.

దుర్గి: మండల పరిధిలో 87 మంది వలంటీర్లు సోమవారం తమ విధులకు రాజీనామా చేశారు. అడిగొప్పుల - 1కు చెందిన 10 మంది, అడిగొప్పుల - 2లో నలుగురు, ఆత్మకూరులో నలుగురు, దుర్గి-2లో ఇద్దరు, పోలేపల్లిలో ఏడుగురు, ముటుకూరు - 1లో 24 మంది, ముటుకూరు-2లో ఏడుగురు, ఓబులేశునిపల్లెలో 29 మంది రాజీనామా చేశారు. ఆ పత్రాలను దుర్గిలో ఎంపీడీవో గుప్తకు అందించారు.

అగ్నిప్రమాదాల నివారణపై అవగాహన

సత్తెనపల్లి, ఏప్రిల్ 15 : అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా స్థానిక అగ్నిమాపకశాఖ అధికారి ఎంవీ సుబ్బారావు ఆధ్వర్యంలో అగ్నిమాపక సిబ్బంది సోమవారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో ప్రజలకు అగ్ని ప్రమాదాలు జరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు, జరిగిన తరువాత తీసుకోవాల్సిన చర్యల గురించి వివరిస్తూ అవగాహన కల్పిస్తూ కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో అగ్నిమాపక సిబ్బంది ఎస్‌కే గౌస్, హుస్సేన్, గోవిందు, నాగేశ్వరరావు, మోహన్‌బాబు, శ్రీనివాసరావు, మహేంధర్‌రెడ్డి పాల్గొన్నారు.

చెక్‌పోస్టుల పరిశీలన

దాచేపల్లి, ఏప్రిల్ 15: స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ డిప్యూటీ కమిషనర్ కే.శ్రీనివాసరావు సోమవారం మండలంలోని పొందుగల, తంగెడ చెక్ పోస్టులను పరిశీలించారు. పొరుగురాష్ట్రాల నుంచి మద్యం రవాణా కాకుండా చూడాలని, నాటుసారా స్థావరాలపై దృష్టి సారించాలని సూచించారు. కమిషనర్‌తోపాటు గురజాల సెబ్ ఇన్‌స్పెక్టర్ వెంకటరమణ, పిడుగురాళ్ల సెబ్ ఇన్‌స్పెక్టర్ సూర్యనారాయణ, మాచర్ల సెబ్ ఇన్‌స్పెక్టర్ కెపి కిషోర్ తదితరులున్నారు.

పెన్షనర్లకు వైద్య ఖర్చులపై

సీలింగ్ ఎత్తివేయాలి

మాచర్లటౌన్, ఏప్రిల్ 15: పెన్షనర్లు ప్రభుత్వ గుర్తింపు పొందిన అన్ని రిఫరల్ హాస్పిటల్స్‌లో చేయించుకునే వైద్య ఖర్చులకు ఉన్న పరిమితిని ఎత్తివేయాలని పెన్షనర్ల సంఘం రాష్ట్ర కార్యదర్శి గాదె రామకృష్ణారావు డిమాండ్ చేశారు. సోమవారం స్థానిక పెన్షనర్స్ అసోసియేషన్ హాల్లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశం మాచర్ల శాఖ అధ్యక్షుడు నందా నరసింహయ్య వహించారు. వృద్ధాప్యంలో పెన్షనర్లకు రావాల్సిన బకాయిలు వెంటనే విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. సమావేశంలో కార్యదర్శి నాగేశ్వరరావు, కోశాధికారి గాలీబు, ఈశ్వరయ్య, మాబు, తులసీ, పాపిరెడ్డి, అంజయ్య, గౌస్, రాయపరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికల విధులపై అప్రమత్తంగా ఉండాలి

క్రోసూరు, ఏప్రిల్ 15 : ఎన్నికల నిర్వాహణలో పీవోలు, ఏపీవోలు, ఎన్నికల సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని డీఆర్‌వో వినాయక్ అన్నారు. సోమవారం క్రోసూరులోని పాలిటెక్నిక్ కళాశాలలో సోమవారం నియోజవర్గ స్థాయి ఎన్నికల అధికారుల, సిబ్బంది శిక్షణా కార్యక్రమంలో పాల్గొన్న ఆయన ఎన్నికల విధి, విధానాలను వివరించారు. పీవోలు, ఏపీవోలు ఈవీఎంలు, వీవీ ప్యాట్‌ల ఆపరేటింగ్‌పై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఎన్నికలకు ముందు రోజు, పోలింగ్ ప్రారంభించే ముందు, పోలింగ్ పూర్తయిన తర్వాత ఏమేమి పనులు చేయాలన్న విషయాలను మాక్ పోలింగ్ ద్వారా తెలియ జేశారు. శిక్షణలో పాల్గొన్న అధికారులు, సిబ్బంది తెలుసుకున్న ప్రతి సమాచారాన్ని రాసుకొని పూర్తిగా ఆకళింపు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో నియోజక వర్గ రిటర్నింగ్ అధికారి శ్రీరాములు, ఐదు మండలాల తహసీల్దార్లు ఎం పూర్ణ (క్రోసూరు), ప్రవీణ్(అచ్చంపేట), ప్రసాదు(బెల్లంకొండ), రమణారావు(అమరావతి), ప్రభాకరరావు(పెదకూరపాడు)లతో పాటు ఆయా మండలాల అధికారులు పాల్గొన్నారు.

తాగునీటి చెరువులకు సాగర్ జలాలు

పెదకూరపాడు, ఏప్రిల్ 15 : గ్రామాల్లో తాగునీటికి ఇబ్బంది లేకుండా చెరువులను సాగర్ జలాలతో నింపుతున్నట్లు ఎంపీడీవో మల్లేశ్వరి తెలిపారు. సోమవారం పెదకూరపాడులోని తాగు నీటి చెరువును ఆమె పరిశీలించారు. అమరావతి మేజరు నుంచి కాల్వల ద్వారా వస్తున్న నీటిని ట్రాక్టర్లు, ఇంజన్‌ల సాయంతో చెరువులు నింపటాన్ని పరిశీలించారు. తాగు నీటి కోసం వస్తున్న నీటిని ఎవ్వరూ పొలాలకు పెట్టవద్దని ఆమె అన్నారు.

టీడీపీతోనే పేదలకు సంక్షేమం

కారంపూడి, ఏప్రిల్ 15: టీడీపీ అధికారంలోకి వస్తే పేదలకు సూపర్ 6 పథకాలు అమలు చేసి సంక్షేమ పథకాలు అందిస్తారని టీడీపీ మండల మాజీ అధ్యక్షుడు చప్పిడి రాము, జనసేన సమన్వయకర్త బూసా రామాంజినేయులు అన్నారు. సోమవారం రాత్రి మండలంలోని పేటసన్నిగండ్ల గ్రామ ఎస్సీ కాలనీలో ఇంటింటికి తిరిగి సూపర్ 6 పథకాలను వివరించారు. కార్యక్రమంలో చావా వీరాంజనేయులు, దొడ్డా వెంకటనారాయణ పాల్గొన్నారు.

17న ఉచిత కంటి పరీక్షలు

పెదకూరపాడు, ఏప్రిల్ 15: ఎల్వీ ప్రసాదు కంటి ఆస్పత్రి సౌజన్యంతో మాగులూరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో మండంలోని హుస్సేన్ నగరంలో ఈనెల 17న కంటి వైద్యశిబిరం జరుగుతుందని నిర్వాహకులు ఎం.కృష్ణారావు, కే.కిరణ్‌లు తెలిపారు. కంటి పరీక్షల అనంతరం అవసరమైన వారికి కంటి ఆపరేషన్‌లు చేయిస్తామన్నారు.



కన్నా సమక్షంలో వైసీపీ వీడి టీడీపీలో చేరిన కోట నెమలిపురి వాసులు

మీకు అండగా నేనుంటా..

- ఉమ్మడి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ

రాజుపాలెం, ఏప్రిల్ 15: 'నియోజకవర్గ ప్రజలకు ఎప్పుడు ఏ సమస్య వచ్చినా నేను అండగా వుంటాను, దేనికీ ఆందోళన చెందాల్సిన అవసరం లేదు' అని సత్తెనపల్లి నియోజకవర్గ కూటమి అభ్యర్థి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు. సోమవారం ఉప్పలపాడు గ్రామంలో కన్నా పర్యటించారు. స్థానిక టీడీపీ నేతలతో కలసి అల్లంశెట్టి ఆనందరావు ఇంటికి వెళ్లి ఆయనతో మాట్లాడారు. తెలుగుదేశం పార్టీ అధికారంలోకి రాగానే గ్రామంలోని అన్ని సమస్యలను పరిష్కరిస్తానని, అభివృద్ధి అంటే ఏమిటో గ్రామస్థులకు చూపిస్తానన్నారు. మీరెవరూ అధికార పార్టీ చేసే హెచ్చరికలకు భయపడవద్దని, పార్టీ నేతలను, కార్యకర్తలను కంటికి రెప్పలా కాపాడుకుంటానన్నారు. అందరూ కలసికట్టుగా టీడీపీ విజయానికి గట్టిగా పనిచేయాలని కోరారు. ఆయన వెంట టీడీపీ మండల అధ్యక్షుడు పల్లపాటి పెద్దిరాజు, జిల్లా టీడీపీ అధికారప్రతినిధి పూజల వెంకట కోటయ్య, మాజీ ఎంపీపీ నర్రా బాబురావు, మాజీ మండల అధ్యక్షుడు అంచుల నరసింహారావు, అంకాళ్ల ప్రభుదాసు, తదితరులున్నారు.

వైసీపీ నుంచి 50 కుటుంబాలు టీడీపీలో చేరిక

సత్తెనపల్లి : రాజుపాలెం మండలం కోట నెమలి పురికి చెందిన వైసీపీ నాయకులు వెన్నా వెంకటరెడ్డి ఆధ్వర్యంలో ఆపార్టీకి చెందిన 50 కుటుంబాలు సోమవారం సాయంత్రం సత్తెనపల్లిలోని టీడీపీ ప్రజావేదికలో కూటమి అభ్యర్థి కన్నా సమక్షంలో టీడీపీలో చేరాయి. వారికి కన్నా కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారికి టీడీపీ ఎప్పుడూ అండగా ఉంటుందన్నారు. పార్టీలో చేరిన వారిలో కోటనెమలిపురికి చెందిన ఎంపీటీసీ ఉడుముల అంజిరెడ్డి, మాజీ సర్పంచ్‌లు దేవిరెడ్డి రమణారెడ్డి, తిరుమలపల్లి శ్రీరాములు, టీడీపీ రాజుపాలెం మండల అధ్యక్షుడు పీ.పెద్దిరాజు, బాబూరావు, పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఆస్పత్రిలోని బాధితులకు పరామర్శ.

ముప్పాళ్ళ మండలం తొండపిలో ఎన్నికల ప్రచారంలో గుంటూరు మాజీ మేయర్ కన్నా నాగరాజు ఆదివారం రాత్రి ప్రచారం చేస్తున్న సమయంలో గ్రామానికి చెందిన వైసీపీ శ్రేణులు పలువురు టీడీపీ కార్యకర్తలపై దాడి చేశారు. ఈదాడిలో గాయపడి సత్తెనపల్లి ఏరియా వైద్యశాలలో చికిత్స పొందుతున్న షేక్ బందెల సుభానీ, షేక్ ఎల్ బాజీ, సయ్యద్ బాజీలను సోమవారం కన్నా లక్ష్మీనారాయణ పరామర్శించారు. దాడికి పాల్పడిన వారిపై కేసు నమోదు చేసి అరెస్టు చేయాలని కన్నా డిమాండ్ చేశారు. ఆయన వెంట తొండపి, సత్తెనపల్లికి చెందిన పలువురు టీడీపీ నాయకులు ఉన్నారు.

ఎన్నికల అధికారులకు ప్రత్యేక శిక్షణ

సత్తెనపల్లి, ఏప్రిల్ 15 : పట్టణంలోని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో సోమవారం ఆర్‌వో మురళీకృష్ణ ఆధ్వర్యంలో ఎన్నికల పీవోలు, ఏపీవోలకు శిక్షణా తరగతులను నిర్వహించారు. ఎన్నికల అధికారులకు డిస్ట్రిబ్యూషన్ సెంటర్, రిసెప్షన్ సెంటర్, పోలింగ్ కేంద్రం వద్ద పోలింగ్‌కు ముందు రోజు, పోలింగ్ రోజు విధులు ఏవిధంగా నిర్వహించాలో వివరించారు. ఈవీఎంల పని తీరు గురించి తెలియజేశారు. ఎన్నికలకు సంబందించిన వివిధ అంశాల గురించి తెలియ జేశారు. పీవోలు, ఏపీవోలు నిష్పక్షపాతంగా ఎన్నికలు నిర్వహించాలని తెలిపారు. శిక్షణా తరగతులకు ఆయా మండలాల అసిస్టెంట్ పోలింగ్ అధికారులు, నియోజక వర్గంలోని పీవోలు, ఏపీవోలు హాజరయ్యారు.

మైనరు నిశ్చితార్థాన్ని అడ్డుకున్న అధికారులు

- బాలిక కుటుంబ సభ్యులకు అధికారుల కౌన్సెలింగ్

గురజాలటౌన్, ఏప్రిల్ 15: మండలంలోని గొట్టిముక్కల గ్రామంలో మైనరు బాలికకు నిర్వహిస్తున్న నిశ్చితార్థాన్ని అధికారులు అడ్డుకున్నారు. గ్రామంలో సోమవారం మైనర్ బాలికకు నిశ్చితార్థం నిర్వహిస్తున్నారని చైల్డ్ హెల్ప్ లైన్‌కు చెందిన ఒకరు వాట్సాప్ ద్వారా ఫిర్యాదు చేయడంతో స్పందించిన అధికారులు గ్రామానికి చేరుకొని ఆ నిశ్చితార్థాన్ని నిలిపి వేయించారు. గ్రామ పెద్దల సమక్షంలో బాలిక తల్లిదండ్రులకు కౌన్సెలింగ్ ఇచ్చి బైండోవర్ రాయించుకున్నారు. కార్యక్రమంలో డీసీపీవో శ్రీనివాసరావు, ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అరుణశ్రీ తదితరులు పాల్గొన్నారు.



పల్నాడు వార్తలు

◆ నరసరావుపేట ◆ వినుకొండ ◆ చిలకలూరిపేట

ఇంకా అందని ఏప్రిల్ నెల రేషన్

● సుమారు 900మంది కార్డుదారుల ఎదురుచూపులు

ఈపూరు, ఏప్రిల్ 15: మండలంలోని కొచ్చెర్లలో ఏప్రిల్‌లో అందాల్సిన రేషన్ ఇంకా అందలేదు. ఏప్రిల్ నెల 15రోజులు గడిచినప్పటికీ 14వ నంబరు రేషన్ షాపు పరిధిలో సుమారు 900మంది కార్డుదారులు రేషన్ సరుకుల కోసం ఎదురు చూస్తున్నారు. అంతేగాక శివారు గ్రామమైన కొత్తనెల్లూరులో కూడా షాపు ద్వారా రేషన్ పంపిణీ జరగాల్సిఉంది. మరో రెండు రోజులలో పంపిణీ కూడా నిలిపివేస్తారు. గతంలో పనిచేసిన డీలర్‌కు మరలారేషన్ సరుకును అప్పగించారు. కాని ఈపోస్ యంత్రం, వేలిముద్రల లాగిన్ అప్పగించలేదు. దాంతో పంపిణీ నిలిచింది. అధికారులకు ఆ డీలర్ తెలియజేసినప్పటికి ఇప్పటి వరకు పంపిణీ చేసిన వాళ్లకు అప్పగించు నీకు రావాల్సిన డీడీ డబ్బులు ఇస్తారని సంబంధిత అధికారులు డీలర్‌కు తెలిపారు. కాని డీలర్ సరుకును అప్పగించినట్లు తనకు లెటర్ ఇవ్వాలని అనడంతో అధికారులు పంపిణీ కార్యక్రమాన్ని విరమించుకున్నట్లు తెలిసింది. దీనిపై అధికారులను వివరణ కోసం యత్నించగా అందుబాటులోకి రాలేదు.

మెరుగైన తాగునీటి సరఫరాకు చర్యలు

● మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి



సమస్యలపై స్థానికులతో మాట్లాడుతున్న మునిసిపల్ కమిషనర్ రవిచంద్రారెడ్డి

నరసరావుపేట రూరల్, ఏప్రిల్ 15, పల్నాడు జిల్లా కేంద్రమైన నరసరావుపేట పట్టణంలోని శివారు ప్రాంతాల వారికి మెరుగైన తాగునీటి సరఫరా చేసేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టడం జరుగుతుందని మునిసిపల్ కమిషనర్ సి.రవిచంద్రారెడ్డి తెలిపారు. నరసరావుపేట పురపాలక సంఘం పరిధిలో మున్సిపల్ కమిషనర్ సి రవిచంద్ర రెడ్డి మార్నింగ్ విజిట్ లో భాగంగా పట్టణంలోని 6 వార్డు బాబాపేట, 3వ వార్డు నిమ్మతోట పరిసర ప్రాంతాలలో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా వార్డుల్లో నిర్వహిస్తున్న పారిశుధ్యం, తాగునీటి సరఫరా తదితర సమస్యలను వార్డు ప్రజలను అడిగి తెలుసుకున్నారు. కమిషనర్ మాట్లాడుతూ ఎండాకాలం సమయంలో మంచినీరు తక్కువగా రావడం జరుగుతుందని కావున తాగునీరుని పొదుపుగా వాడుకోవాలని కోరారు. కార్యక్రమంలో టౌన్‌ప్లానింగ్ అధికారి నరశింహారావు, అసిస్టెంటు ఇంజనీర్ సువర్ణరాజు, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, సచివాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై కరపత్రాల పంపిణీ

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 15: అగ్నిమాపక శాఖ వారోత్సవాల్లో భాగంగా సోమవారం పట్టణంలోని రైల్వే స్టేషన్, ఆర్టీసీ బస్టాండ్‌ల వద్ద, పట్టణంలోని ప్రధాన కూడళ్లల్లో అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కోసం ముద్రించిన కరపత్రాలను పంపిణీ చేశారు. అగ్నిమాపక సిబ్బంది గోడ పత్రికలను అంటిస్తూ కరపత్రాలను పంచుతూ ప్రజలకు అవగాహన కల్పించారు.

13వ అదనపు జిల్లా జడ్జిగా సత్యశ్రీ బాధ్యతల స్వీకారం

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 15: స్థానిక 13వ అదనపు జిల్లా సెషన్స్ న్యాయమూర్తిగా ఎస్ సత్యశ్రీ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. విశాఖపట్నంకు చెందిన సత్యశ్రీ 2013లో అదనపు జిల్లా జడ్జిగా ఎంపికయ్యారు. శిక్షణ అనంతరం 2014లో శ్రీకాకుళంలో అదనపు జిల్లా జడ్జిగా సేవలు అందించారు. తదుపరి గుంటూరు, గురజాల, నెల్లూరులలో అదనపు జిల్లా న్యాయమూర్తిగా సేవలు అందించారు. ఇటీవల జరిగిన బదిలీల్లో భాగంగా ఆమె నరసరావుపేటకు బదిలీపై వచ్చారు. 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు ఇన్‌చార్జ్ న్యాయమూర్తి, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి పీవీఎస్ సూర్యనారాయణమూర్తి నుంచి ఆమె బాధ్యతలు స్వీకరించారు.

మే 11న జాతీయ లోక్ అదాలత్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 15: మే 11న జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు 13వ అదనపు జిల్లా సెషన్స్ కోర్టు న్యాయమూర్తి ఎస్.సత్యశ్రీ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర న్యాయ సేవాధికార సంస్థ, జిల్లా న్యాయ సేవాధికార సంస్థల ఆదేశాల మేరకు స్థానిక న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో న్యాయ స్థాన భవనాల సముదాయంలో జాతీయ లోక్ అదాలత్ నిర్వహించనున్నట్లు ఆమె తెలిపారు. అదాలత్‌లో రాజీ పడదగిన క్రిమినల్ కేసులు, సివిల్ కేసులు, చెల్లని చెక్కు కేసులు, మోటారు వాహన ప్రమాద కేసులు, రెవెన్యూ కేసులు, బ్యాంక్ కేసులు, కుటుంబ సంబంధ కేసులు, ముందస్తు వ్యాజ్యాలు రాజీ మార్గం ద్వారా పరిష్కరించు కోవచ్చన్నారు. తద్వారా కక్షిదారులు సమయాన్ని, ధనాన్ని ఆదా చేసుకోవచ్చన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగపరుచుకోవాలని ఆమె కోరారు.

బస్సు యాత్రకు స్పందన లేకనే జగన్ డ్రామాలు

● టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 15: బస్సు యాత్రకు స్పందన లేదనే జగన్‌మోహన్‌రెడ్డి దాడి డ్రామాలు చేస్తున్నారని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి గోనుగుంట్ల కోటేశ్వరరావు సోమవారం ఒక ప్రకటనలో విమర్శించారు. సరిగ్గా కరెంటు పోయినప్పుడు దాడి ఎలా జరిగిందని, చుట్టూ వైసీపీ వారు, పోలీసులు ఉన్నా నిందితుల్ని ఎందుకు పట్టుకోలేదని ప్రశ్నించారు. గత ఎన్నికలలో ముందు కోడి కత్తి, బాబాయ్ హత్య పేరుతో డ్రామాలు ఆడి సానుభూతి పొందిన జగన్‌మోహన్ రెడ్డి ఇప్పుడు ఇంకో కొత్తడ్రామాకు తెరలేపారన్నారు. ఈ ఘటన మొత్తం అనేక అనుమానాలకు తావిస్తోందన్నారు. కరెంట్‌పోయిన సమయంలో సరిగ్గా గురి చూసికంటిపై భాగంలో ఎలా దాడిచేస్తారని ప్రశ్నించారు. పోనీ దాడి నిజమైతే చుట్టూ వైసీపీ కార్యకర్తలు, పోలీసులు ఉన్నారని, మరి నిందితుల్ని ఎందుకు పట్టుకోలేదన్నారు. ఇవన్నీ చూస్తుంటే ఇది పక్కాగా స్వీయ దాడిగా అనుమానం కల్గుతోందన్నారు. ఇవన్నీ ప్రజలు గమనిస్తున్నారని, జగన్‌మోహన్‌రెడ్డి మాటలు నమ్మే ప్రసక్తి ఉండదని అన్నారు.

మద్యరహిత ఎన్నికలే సెబ్ ధ్యేయం

డీసీ డాక్టర్ శ్రీనివాస్

నరసరావుపేట లీగల్, ఏప్రిల్ 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో అక్రమ మద్యం ప్రభావం లేకుండా నివారించేలా తగు చర్యలు తీసుకుంటున్నామని పల్నాడు జిల్లా స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో డీసీ డాక్టర్ కే శ్రీనివాస్ సోమవారం తెలిపారు. రాష్ట్ర స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో కమిషనర్ ఎం రవిప్రకాష్ ఆదేశాల మేరకు ఎన్నికల్లో అక్రమ మద్యం నిల్వలను నివారించటానికి, మద్యం పాత్రను నిరోధించటానికి తగు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇందులో భాగంగా అన్ని జిల్లాల్లో స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహిస్తుందన్నారు. ఈ సందర్భంగా ఆయన నరసరావుపేట సెబ్ సూపరింటెండెంట్ కార్యాలయంలో ఆ శాఖ ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల దృష్ట్యా అక్రమ మద్యం డంపులు, మద్యం నిల్వలు, అక్రమ సరఫరా నివారించటానికి తగు చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో నరసరావుపేట స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో ఈఎస్ షేక్ ఖాజామొహిద్దీన్, ఏఈఎస్ కే ప్రభాకరరావు, వినుకొండ సీఐ అబ్దుల్ జలీల్, నరసరావుపేట సీఐ నయనతార, ఈపూరు ఎస్‌ఐ రేవతి తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఏరులై పారుతున్న మద్యం

● వరికపూడిశల, వాటర్ గ్రిడ్ పథకాల పనులను పూర్తిచేస్తా

● మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు



ఉప్పరపాలెంలో ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు

వినుకొండ, ఏప్రిల్ 15: నియోజకవర్గంలో తాగునీటికోసం అల్లాడుతుంటే, గ్రామాల్లో నీటికన్నా మద్యం ఎక్కువగా అందుబాటులో ఉంచిన దిక్కుమాలిన ప్రభుత్వం జగన్‌దే అని పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు అన్నారు. మండలంలోని కొండ ఉప్పరపాలెంలో ఆదివారం రాత్రి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్ళి తెలుగుదేశం అధికారంలోకి వస్తే చేపట్టే సంక్షేమ పథకాలను వివరిస్తూ వైసీపీ ప్రభుత్వం అరాచకాలను ఎండగడుతూ ఇంటింటికి తిరిగి కరపత్రాలను పంపిణీ చేశారు. రాష్ట్రాన్ని చక్కదిద్దుకోవాలంటే తాగుబోతు పాలకుడిని సాగనంపాల్సిన బాధ్యత ఎంతైనా ఉందన్నారు. మద్యం ఆదాయం మీద యావతో 30వేల మందికి పైగా ప్రాణాలు తీసిన రాబందులు చిన్న రాయి దెబ్బకు అల్లాడిపోతుండడం ఆశ్చర్యం కల్గిస్తుందన్నారు. వైసీపీ తెచ్చిన నాశిరకం బ్రాండ్ చీప్ లిక్కర్ దెబ్బకు వేల కుటుంబాలు రోడ్డున పడ్డాయంటూ తెలుసా అంటూ జగన్మోహన్‌రెడ్డిని ప్రశ్నించారు. మద్యం అమ్మకాల రూపంలో లక్ష కోట్లకు పైగా ఈ జగన్మోహన్‌రెడ్డి దోచుకుంటున్నారని ఇవి చాలక ఇసుక మైనింగ్ భూ ఆక్రమణల ద్వారా ఎన్ని కోట్లు దోచుకున్నారో లెక్కతేలిస్తే ప్రజలే వారిని తరిమికొడతారని స్పష్టం చేశారు. రాష్ట్రవ్యాప్తంగా వైసీపీ ఎమ్మెల్యేల దోపిడీ ఏ స్థాయిలో ఉందో ప్రజలకు అర్థమవుతుందన్నారు. వినుకొండ స్వాతిముత్యం బొల్లా బ్రహ్మానాయుడు ఇందుకు ఉదాహరణ అని అన్నారు. బొల్లా ఎమ్మెల్యే అయ్యాక బెల్టు షాపుల్లో కమీషన్లు లెక్కపెట్టుకోవడం తప్ప వినుకొండ తాగు, సాగు అవసరాలపై ఏ మాత్రం దృష్టిపెట్టిన పాపాన పోలేదన్నారు. ఎస్సీ, బీసీ కాలనీల్లో ఒక సిమెంట్ రోడ్డు అయిన వేశారా అని, మురుగు కాల్వ నిర్మించారా అని ఈ సందర్భంగా నిలదీశారు. తెలుగుదేశం, జనసేన, బీజేపీ ఉమ్మడి ప్రభుత్వం ఏర్పడిన వెంటనే రైతు పంటకు అవసరమైన వరికపూడిశల ప్రాజెక్టు తాగునీటికి వాటర్‌గ్రిడ్ పథకాన్ని పూర్తిచేస్తామని, సాగునీటి కష్టాలు తీర్చాలన్నదే తన స్వప్నం అన్నారు.

పట్టణంలోని 24వ వార్డులో ఊపందుకున్న ప్రచారం...

సార్వత్రిక ఎన్నికల ప్రచార కార్యక్రమంలో భాగంగా పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సతీమణి గోనుగుంట్ల లీలావతి 24వ వార్డులో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికీ వెళ్ళి సైకిల్ గుర్తుపై ఓటు వేయాలని అభ్యర్థించారు. తెలుగుదేశంపార్టీ అధికారంలోకి వస్తే మహిళల సమస్యలు తీరుతాయని, వైఈపీ ప్రభుత్వంలో ఎక్కడ సమస్యలు అక్కడే ఉన్నాయని, మున్సిపాల్టీ ద్వారా కనీసం ఒక పనైనా చేసిన దాఖలాలు లేవని, ఓటువేసి ప్రతి ఒక్కరూ స్థానిక ఎమ్మెల్యే బొల్లా బ్రహ్మనాయుడు తీరుపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారని అన్నారు. అనంతరం తెలుగుదేశం పార్టీ ప్రవేశపెట్టిన సూపర్ సిక్స్ పథకాలు కరపత్రాలను మహిళలకు పంపిణీచేశారు. అదేవిధంగా జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ ఎస్ఎస్‌పీ కాలనీలోని కూరగాయల మార్కెట్‌లో ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వ్యాపారులను వారు ఎదుర్కొంటున్న సమస్యలు గురించి అడిగి తెలుసుకున్నారు. జీవీ ఆంజనేయులు గెలిచిన వెంటనే స్థానిక సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేయడం జరుగుతుందని హామీ ఇచ్చారు.

పలువురు టీడీపీలో చేరిక

పోట్లూరు (శావల్యాపురం) ఏప్రిల్ 15: మండలంలోని శానంపూడిలో వైసీపీకి చెందిన 30 కుటుంబాలవారు ఉమ్మడి కూటమి అభ్యర్థి, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో ఆదివారంరాత్రి టీడీపీ తీర్థం పుచ్చుకొన్నాయి. బోడెశంభునిపాలెం సమీపంలోని తన గెస్ట్‌హౌస్‌లో నూతనంగా పార్టీలోకి చేరినవారికి జీవీ పార్టీకండువాలు కప్పి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షులు గుంటూరు సాంబశివరావు, మాజీ ఎంపీపీ అమృతపూడి కోటయ్య, టీడీపీ మాజీ మండలాధ్యక్షులు యరమాసు కోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

● ఈపూరు,ఏప్రిల్15: మండలంలోని బోడెపూడివారిపాలెంలో 8 కుటుంబాలు వాళ్ల వైసీపీ నుండి టీడీపీలోకి వచ్చారు. వారికి వినుకొండ టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి జీవీ ఆంజనేయులు తనయుడు హరీష్ కండువాలు వేసి ఆహ్వానించారు. అనంతరం గ్రామంలో ప్రచారం నిర్వహించారు.

● నూజెండ్ల, ఏప్రిల్ 15: మండలంలోని పువ్వాడ పంచాయతీ పరిధిలోని కొత్త కొత్తపాలెం, పాత కొత్తపాలెం, కొండలరాయునిపాలెం, పువ్వాడ గ్రామాల నుంచి 50 వైసీపీ కుటుంబాలు సోమవారం జిల్లా పార్టీ అధ్యక్షులు ఉమ్మడి వినుకొండ నియోజక వర్గ టీడీపీ అభ్యర్థి జీవీ ఆంజనేయులు సమక్షంలో టీడీపీలో చేరారు. కార్యక్రమంలో పార్టీ ఎన్నికల పరిశీలకులు ఎం.శివరామ ప్రసాదు, కె.వీరాంజనేయులు, బాబు, ఎస్.బ్రహ్మయ్య, కె.కృష్ణారెడ్డి, మాజీ ఎమ్మెల్యే ఎం.మల్లిఖార్జునరావు, పార్టీ మండల అధ్యక్షుడు మీసాల మురళీకృష్ణ యాదవ్ తదితరులు ఉన్నారు.

యువ పారిశ్రామికవేత్తలకు...

రూ.10 లక్షలు ఆర్థిక సాయం అందిస్తాం

● మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు



సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి ప్రత్తిపాటి పుల్లారావు

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 15: ఎన్నికల అనంతరం కూటమి ప్రభుత్వం రాగానే రాష్ట్రంలోని యువ పారిశ్రామిక వేత్తల కోసం రూ.10 లక్షల ఆర్థికసాయాన్ని అందించే కొత్త పథకాన్ని తీసుకు రానున్నట్లు మాజీ మంత్రి, టీడీపీ నియోజకవర్గ ఉమ్మడి అభ్యర్థి ప్రత్తిపాటి పల్లారావు వెల్లడించారు. రాష్ట్రంలో యువతను ప్రోత్సాహిక పారిశ్రామిక వేత్తలుగా తీర్చిదిద్దేందుకు చంద్రబాబు, పవన్ ఎంతో ఆలోచించి ఈ నిర్ణయం తీసుకున్నారని ఆయన అన్నారు. సోమవారం పట్టణంలోని పురుషోత్తపట్నంలో ఎన్నికల శంఖారావం, సూపర్-6 పథకాలపై ప్రచారంలో ప్రత్తిపాటితో పాటు ఎంపీ లావు శ్రీకృష్ణ దేవరాయలు పాల్గొన్నారు. ఇంటింటికి తిరిగి సూపర్ -6 పథకాలపై అవగాహన కల్పించి కరపత్రాలు పంపిణీ చేశారు. ముందుగా ప్రత్తిపాటి, లావులకు తెలుగుదేశం, జనసేన, నాయకులు, కార్యకర్తలు అపూర్వ స్వాగతం పలికారు. వారిద్దరు ట్రాక్టర్ నడిపి శ్రేణులను ఉత్సాహపరిచారు. అనంతరం ఆయన మాట్లాడుతూ చంద్రబాబు, పవన్ రూపొందించిన రూ.10లక్షల ఆర్థికసాయం పథకం గురించి వివరించారు. దీని ద్వారా యువత ఉద్యోగాల కోసం ఎదురు చూసే వారిగానేకాక ఉద్యోగాలు ఇచ్చే స్థితిలో నిలుస్తారని ఆశాభావం వ్యక్తం చేశారు. జగన్‌రెడ్డి పాలన బటన్ నొక్కుడు సంక్షేమంతా బూటకమని, అతని పాలనలో ఎస్సీ ఎస్టీ, బీసీ, మైనార్టీలు దగాపడ్డారని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. నమ్ముకున్న ఎంతోమందిని మోసంచేసిన స్వార్థపరుడు జగన్ అన్నారు. ఎంపీలు బాలశౌరి, మాగుంట శ్రీనివాసులరెడ్డిలతో సహా ఎంతోమంది జగన్‌రెడ్డి బాధితులేనన్నారు. ఐదు సంవత్సరాలు అధికారం వెలగబెట్టి గుంటూరుకు పారిపోయిన మంత్రి రజిని తన సొంతూరు పురుషోత్తపట్నంకు ఏనా ఏం చేశారో చెప్పాలన్నారు. తాను గెలిస్తే ఆ ఊరికి ఏం కావాలన్నా చేసి చూపిస్తానన్నారు. అనంతరం మాట్లాడిన ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు స్థానిక ఎమ్మెల్యే, మంత్రి రజనీతో గ్రామ ప్రజలు ఎప్పుడైనా మాట్లాడారా? అని ప్రశ్నించారు. ఓట్లువేసిన గెలిపించిన ప్రజలను వదిలివేసి వేరే నియోజక వర్గానికి పారిపోతే ఇక్కడి ప్రజలను ఎవరు పట్టించుకోవాలని ఆయన ప్రశ్నించారు. అన్ని నిజాలు తెలిసి రాజకీయంగా ఎంతో చైతన్యం ఉన్న పురుషోత్తపట్నం ప్రజలు వాటిని భరిస్తారా? అని ప్రశ్నించారు. మంత్రి రజిని ఈ నియోజకవర్గంలో ఉన్నన్ని రోజులు సెక్యూరిటీ లేకుండా బయటకు వచ్చిన దాఖలాలు లేవని ఎద్దేవా చేశారు. కూటమి విజయంతో చిలకలూరిపేట నియోజకవర్గంతో పాటు నరసరావుపేట ఎంపీ స్థానం మొత్తంలో అభివృద్ధికి కొత్తబాటలు వేస్తామని ఈ సందర్భంగా హామీ ఇచ్చారు.

వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరిక

పురుషోత్తపట్నం వైసీపీ నుంచి తెలుగుదేశంలోకి పెద్దఎత్తున చేరికలు జరిగాయి. వైసీపీ నాయకుడు, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ బత్తినేని శ్రీనివాసరావు ఆధ్వర్యంలో తోట లక్ష్మీనారాయణ, విడదల శంకరరావు, దేవిరెడ్డి లక్ష్మీనారాయణలతో పాటు మరో వంద కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరాయి. వారందరికీ పార్టీ కండువాలు కప్పి సాదరంగా ప్రత్తిపాటి, లావులు ఆహ్వానించారు.

వైసీపీ పాలనలో అత్యధికంగా నష్ట పోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలే

చిలకలూరిపేట అర్బన్, ఏప్రిల్ 15: ఐదు సంవత్సరాల వైసీపీ పాలనలో రాష్ట్రంలో అత్యధికంగా నష్టపోయింది ఎస్సీ, ఎస్టీ, బీసీ మైనార్టీలేనని మాజీ మంత్రి, చిలకలూరిపేట ఎమ్మెల్యే ఉమ్మడి టీడీపీ అభ్యర్థి ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. వారి భూములు, ఆస్తులు కాజేయటం దగ్గర నుంచి ప్రాణాలకు రక్షణలేకుండా చేయటం వరకు జగన్‌రెడ్డి ప్రభుత్వం చేయని అరాచకాలు లేవని ఆయన ధ్వజమెత్తారు. వారి అభివృద్ధి కోసం గత టీడీపీలో హయాంలో ప్రవేశపెట్టిన వందకు పైగా పథకాలు రద్దుచేసిన దివాలాకోరు పార్టీ మళ్ళీ ఏమొఖం పెట్టుకొని ఓట్లు అడుగుతున్నారని నిలదీశారు. సోమవారం పట్టణంలోని ప్రత్తిపాటి క్యాంపు కార్యాలయంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు కొనసాగాయి. యడ్లపాడు, నాదెండ్ల మండలాలతో పాటు పట్టణానికి చెందిన వైసీపీ నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. సాతులూరు నుంచి 15 కుటుంబాలు, కొండవీడు నుంచి 15 కుటుంబాలు, చిలకలూరిపేట పట్టణానికి చెందిన ముస్లింలీగ్ పార్టీ, వైసీపీకి చెందిన 17 కుటుంబాలు కూడా టీడీపీలో చేరాయి. వీరందరినీ ప్రత్తిపాటి పార్టీ కండువాలు వేసి సాదరంగా పార్టీలోకి ఆహ్వానించి మాట్లాడుతూ నియోజకవర్గంలో మంత్రి రజిని ఆమె అనుచరులు ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలను పూర్తిగా మోసం చేశారని, ఐదు సంవత్సరాలుగా వారికి ఇచ్చిన హామీలు నెరవేర్చకపోగా వాటిపై నిలదీస్తారనే భయంతో రజిని గుంటూరు పారిపోయిందని, చివరకు ఇక్కడ పోటీ చేసే వారు లేక మూడు నెలల్లో ముగ్గురు అభ్యర్థులను మార్చారని, అందుకే నిజంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ ప్రజాసేవ చేసే వారికే ఎన్నికల్లో ఓటు వేసి గెలిపించాలని ప్రత్తిపాటి విజ్ఞప్తి చేశారు.

తెలుగుదేశంతోనే అభివృద్ధి, సంక్షేమం

యడ్లపాడు, ఏప్రిల్ 15 : రాష్ట్ర అభివృద్ధి, ప్రజా సంక్షేమం ఒక్క తెలుగుదేశం పార్టీతోనే సాధ్యమని టీడీపీ నాయకులు పేర్కొన్నారు. మండల కేంద్రమైన యడ్లపాడు ఎర్రచెరువు ఎస్సీ కాలనీలో సూపర్ సిక్స్ పథకాలపై సోమవారం టీడీపీ నాయకులు ప్రచార కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇంటింటికి తిరిగి సూపర్‌సిక్స్ పథకాలు, వాటి వలన కలిగే ప్రయోజనాలను వివరించి కరపత్రాలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో మండల టీడీపీ కార్యదర్శి కాకుమాను చంటి, నాయకులు పోపూరి రత్తయ్య, వీరాంజనేయులు, గోనుగుంట్ల హరిబాబు, రవికిరణ్, చెన్నుపాటి శ్రీను, ఉప్పలపాటి సీతారామయ్య, ఎ.మోషె తదితరులు పాల్గొన్నారు.



నిరుపేద విద్యార్థులకు సైకిళ్లు పంపిణీచేస్తున్న రోటరీక్లబ్ సభ్యులు

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో విద్యార్థులకు సైకిళ్లు పంపిణీ

వినుకొండ టౌన్, ఏప్రిల్ 15: అంబేద్కర్ జయంతి ఉత్సవాల్లో భాగంగా రోటరీక్లబ్ ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండ్ సమీపంలో సోమవారం అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా 25వేలు రూపాయలు విలువచేసే సైకిళ్ళను నిరుపేద విద్యార్థులందరికీ అందజేశారు. కార్యక్రమంలో రోటరీక్లబ్ గ్రేటర్ వినుకొండ అధ్యక్షుడు చిరుమామిళ్ళ కోటేశ్వరరావు, కార్యదర్శి గుత్తా గుర్నాథం, నాయిబ్ రసూల్, ఆళ్ళ శ్రీనివాసరావు, ముత్తినేని గిరిబాబు, పి.శ్రీనివాసరావు, బత్తుల శ్రీనివాసరావు, బాలరాజు, వెంకటనారాయణ, బాజి, బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు జ్ఞానేశ్వరరావు, రామకోటేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

రేపు శావల్యాపురం మండలంలో ఎన్నికల ప్రచారం

శావల్యాపురం, ఏప్రిల్ 15: రానున్న సార్వత్రిక ఎన్నికల్లో టీడీపీ, జనసేన, బీజేపీ ఉమ్మడి కూటమిని గెలిపించాలని కోరుతూ శావల్యాపురం మండలంలోని పలు గ్రామాల్లో ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయలు, మాజీ ఎమ్మెల్యేలు జీవీ ఆంజనేయులు, మక్కెన మల్లికార్జునరావు కలసి బుధవారం ఎన్నికల ప్రచారాన్ని నిర్వహించనున్నట్లు టీడీపీ మండలాధ్యక్షుడు గుంటూరు సాంబశివరావు సోమవారం తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల ప్రచారంలో భాగంగా వారు శావల్యాపురం, శానంపూడి, బొందిలిపాలెం, మతుకుమల్లి, గంటుపాలెం, వయ్యకల్లు, కారుమంచి గ్రామాలలో వరుసగా పర్యటించనున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాలకు చెందిన టీడీపీ నాయకులు, కార్యకర్తలు, మహిళలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

నేడు మండల పరిషత్ సర్వసభ్య సమావేశం

రొంపిచర్ల, ఏప్రిల్ 15: స్థానిక మండల పరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో మండల పరిషత్ సర్వసభ్య సమావేశం నేడు నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జ్ ఎంపీడీవో లక్ష్మీకుమారి సోమవారం తెలిపారు. మండలంలోని ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు ఈ కార్యక్రమానికి హాజరు కావాలని కోరారు. పలు అంశాలపై చర్చించనున్నట్లు పేర్కొన్నారు.

ఈపూరు మండలంలో 23మంది వలంటీర్లు రాజీనామా

ఈపూరు, ఏప్రిల్ 15: మండలంలో 23మంది వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో ఏవీ రంగనాయకులు తెలిపారు. కొచ్చెర్ల-15, ముప్పాళ్ల-5, ఈపూరు-3 వ్యక్తిగత కారణాలతో రాజీనామాలు అందిజేసినట్లు ఆయన తెలిపారు.

నిబంధనలకు విరుద్ధంగా నీటి మోటార్ల పంపిణీ

బొల్లాపల్లి, ఏప్రిల్ 15: మండలంలోని అయ్యన్నపాలెం గ్రామంలో ఎన్నికల నిబంధనలకు విరుద్ధంగా ఒక కాంట్రాక్టర్ గ్రామస్థులకు నీటి మోటార్లు పంపిణీ చేశారు. దీనిపై ఎంపీడీవో విజయకు మార్‌ను వివరణ అడగ్గా ఈ సమాచారం తమ దృష్టికి కూడా వచ్చిందన్నారు. దీని పై తాము విచారణ జరపగా ఐదుగురు రైతులకు మోటార్లు పంపిణీ చేసినట్లు తేలిందన్నారు. కాంట్రాక్టర్‌పై చర్యలకు ఎస్ఐ చెన్నకేశవులకు తెలిపి, నియోజకవర్గ ఎన్నికల అధికారి సుబ్బారావుకు సమాచారం ఇచ్చామన్నారు.

పోలింగ్ సిబ్బందికి గణపవరంలో శిక్షణ

నాదెండ్ల, ఏప్రిల్ 15: చిలకలూరిపేట నియోజకవర్గంలోని పోలింగ్ సిబ్బందికి గణపవరం గ్రామంలోని కెల్లంపల్లి భద్రాచలం ఉన్నత పాఠశాలలో సోమవారం శిక్షణ ఇచ్చారు. వ్యక్తిగత కారణాల వల్ల ఆర్‌వో నారదముని హాజరుకాలేదు. మునిసిపల్ కమిషనర్ సీహెచ్ గోవిందరావు, తహసీల్దార్లు జ్వాలా నరసింహం, డీబీవీ వరకుమార్ తదితరులు హాజరయ్యారు. 11 తరగతుల్లో 660మంది ఏపీవోలు, పీవోలకు ఐఎఫ్‌పీల సాయంతో పదిమంది ఏఎల్ఎండీయూలు శిక్షణ ఇచ్చారు. ఈవీఎంలను ఎలా సీలు వేయాలి?, మాక్ పోల్ ఎలా నిర్వహించాలి?, ఓటింగ్‌పై శిక్షణ తదితర విషయాలను వివరించారు. కాగా సౌకర్యాల లేమిపై తహసీల్దార్ జ్వాలా నరసింహంను నిలదీశారు. సిబ్బందికి తెచ్చిన భోజనం సరిపోక మరోసారి తీసుకురావాల్సిన పరిస్థితి ఏర్పడింది. ఈ విషయమై పలువురు ఉపాధ్యాయులు అసహనం వ్యక్తం చేశారు.

అక్రమ మద్యం పట్టివేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 15: చిలకలూరిపేట మండలం గోవిందపురం గ్రామ పరిధిలో అక్రమ మద్యం అమ్మకాలు చేస్తున్న కోట అచ్చయ్యను చిలకలూరిపేట రూరల్ పోలీసులు సోమవారం అరెస్టు చేశారు. అతని వద్ద నుంచి తొమ్మిది మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు. రూరల్ ఎస్ఐ జీ రవి కృష్ణ కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

తెలంగాణ పోలీసుల అదుపులో ఇద్దరు బంగారం వర్తకులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 15: పట్టణానికి చెందిన ఇద్దరు బంగారం వర్తకులను తెలంగాణాలోని మిరియాలగూడ పోలీసులు సోమవారం అదుపులోకి తీసుకున్నారు. వీరిని విచారణ కోసం మిరియాలగూడకు తీసుకు వెళ్ళినట్లు సమాచారం. వీరిద్దరు దొంగ బంగారం కొనుగోలు చేశారని సమాచారం అందుకున్న మీదట పోలీసులు ఇక్కడకు వచ్చి వారిని అదుపులోకి తీసుకున్నారని తెలిసింది.

'ఓటుకు ఆధార్ కార్డు లింకు చేయాలి'

చిలకలూరిపేట, ఏప్రిల్ 15: ఓటర్ల జాబితాలో ఓటుకు ఆధార్ కార్డులో తప్పని సరిగా లింకు చేయాలని ఇండియా కూటమి అభ్యర్థి ఎం.రాధాకృష్ణ సోమవారం డిమాండ్ చేశారు. ఓటర్ల జాబితాలో సవరణలు సక్రమంగా ఉండకపోవటానికి ఇవి ప్రధాన కారణమని ఆయన పేర్కొన్నారు. ఓటర్ల జాబితాలో మరణించిన వారి ఓట్లు, అడ్రస్ మారిన వారి ఓట్లు, డబుల్ ఎంట్రీలు తొలగించే విషయంలో ఎన్నో లోపాలు కన్పిస్తున్నాయని పేర్కొన్నారు. ఎప్పటికప్పుడు ఓటర్ల జాబితాలో మార్పులు చేస్తున్నప్పటికీ పరిస్థితిలో మార్పు రావటం లేదన్నారు. నియోజకవర్గంలో మరణించిన వారి ఓట్లు నాలుగు వందలు, డబుల్ ఎంట్రీలు ఐదు వందలు, అడ్రస్ మార్చాల్సినవి ఏడు వందలు, ఇతర రాష్ట్రాల్లో ఉన్న వారికి రెండు వేలు ఓట్లు ఉన్నట్లు ఆయన తెలిపారు. అక్రమ ఓట్ల తొలగింపు వ్యవహారం ఒక కొలిక్కి రావాలంటే ఆధార్‌కార్డును ఓటుతో లింకు చేయాలన్నారు.

19న మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం

యడ్లపాడు, ఏప్రిల్ 15: యడ్లపాడు మండల ప్రజా పరిషత్ సర్వసభ్య సమావేశం ఈ నెల 19న నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో శ్రీనివాసరావు తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ ఎంపీపీ పి ఝాన్సీదయాసాగర్ అధ్యక్షతన జరిగే ఈ సమావేశంలో పలు అంశాలపై సమీక్షించడం జరుగుతుందన్నారు. సార్వత్రిక ఎన్నికలు-2024 నియమ నిబంధనలు, మోడల్ కోడ్‌ఆఫ్ కాండక్ట్ నిబంధనలకు లోబడి కేవలం సమీక్ష మాత్రమే జరుగుతుందన్నారు. ఉదయం 11గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు తప్పక హాజరు కావాలన్నారు. అధికారులు తమ శాఖలకు సంబంధించిన పూర్తి సమాచారంతో రావాలన్నారు.



పిచ్చికంపను తొలగించిన అనంతరం శ్మశానవాటిక

శ్మశానవాటికలో కంపచెట్లు తొలగింపు

వంకాయలపాడు (యడ్లపాడు), ఏప్రిల్ 15: మండలంలోని వంకాయలపాడులోని హిందూ శ్మశానవాటికలో పెరిగిన కంపచెట్లను టీడీపీ నాయకులు సోమవారం తొలగించారు. మాజీమంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు సూచనతో నర్సిరెడ్డి సహకారంతో శ్మశానవాటికలో పెరిగిన కంపచెట్లను జేసీబీతో తొలగించారు. అంతేగాకుండా పోలేరమ్మ అమ్మవారి గుడి చుట్టూ ఉన్న కంపచెట్లను కూడా తొలగించారు. ఈ సందర్భంగా టీడీపీ గ్రామ అధ్యక్షుడు షేక్ బుడే మాట్లాడుతూ తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో శ్మశానవాటికల అభివృద్ధికి రూ.10.50లక్షలు ఖర్చుచేసిందన్నారు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తరువాత గత ఐదేళ్ళుగా శ్మశానవాటికలను అభివృద్ధి చేయలేదన్నారు. దహన సంస్కారాలకు వీలులేకుండా శ్మశానవాటికలో కంపచెట్లు పెరిగాయని, ఈ విషయాన్ని ప్రత్తిపాటి దృష్టికి తీసుకెళ్ళగా ప్రజలకు ఇబ్బంది లేకుండా శ్మశానవాటికలోని కంపచెట్లను తొలగించాల్సిందిగా సూచించారన్నారు. దీనితో కంపచెట్లను పూర్తిగా తొలగించి గుంతలను సరిచేయించామన్నారు. నాయకులు కిలారు సాంబశివరావు, యూనిట్ ఇన్‌చార్జి శరత్, షేక్ నాగూర్ తదితరులు కంప తొలగింపు పనులను పర్యవేక్షించారు.

ఆర్టీసీ గ్యారేజ్‌లో అగ్ని ప్రమాదాల పై అవగాహన

చిలకలూరిపేట, ఏప్రిల్ 15: స్థానిక ఆర్టీసీ బస్టాండ్, ఆర్టీసీ గ్యారేజ్ నందు సోమవారం అగ్నిమాపక వారోత్సవాల్లో భాగంగా అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. బస్టాండ్‌లోని ప్రయాణికులకు అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తల గురించి కరపత్రాలు పంపిణీ చేశారు. విధి నిర్వహణలో ఉన్నప్పుడు అగ్ని ప్రమాదాలను ఎలా నివారించాలో తెలియజేస్తూ గ్యారేజ్ సిబ్బందికి అవగాహన కల్పించారు. స్థానిక అగ్నిమాపక అధికారి ఎన్ కిరణ్‌కుమార్, ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.రాంబాబు పాల్గొన్నారు.

అరవిందబాబుకు శుభాకాంక్షలు తెలిపిన టీడీపీ నాయకులు



అరవిందబాబుకు శుభాకాంక్షలు చెబుతున్న రొంపిచర్ల మండల టీడీపీ నాయకులు

రొంపిచర్ల, ఏప్రిల్ 15: మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు అసెంబ్లీ అభ్యర్థి అరవిందబాబుకు సోమవారం శుభాకాంక్షలు తెలిపారు. ఆయన జన్మదినం సందర్భంగా నరసరావుపేటలోని ఆయన కార్యాలయానికి కేక్ కట్ చేసి, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో మండలంలోని వివిధ గ్రామాల టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ వైర్లను తొలగించాలి

● గాయత్రి నగర్ వాసుల డిమాండ్

వినుకొండ టౌన్, ఏప్రిల్ 15: పట్టణంలోని గాయత్రి నగర్‌లో విద్యుత్ వైర్లు తగిలి ప్రాణాలు పోతున్నాయంటూ స్థానికులు ఆగ్రహం వ్యక్తం చేశారు. విద్యుత్ సమస్యలను వివరించేందుకు గాయత్రి నగర్ వాసులు పెద్ద ఎత్తున విద్యుత్ కార్యాలయానికి చేరుకొని అధికారులు కోసం ఎదురు చూడాల్సిన పరిస్థితి సోమవారం నెలకొంది. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గత కొన్ని నెలలుగా ఇంటిపై వేలాడుతున్న విద్యుత్ తీగల కారణంగా ఇద్దరు బాలికలతోపాటు ఇంటి మరమ్మతులు చేస్తున్న ఓ తాపీమేస్త్రి వైద్యశాలలో చికిత్స పొందుతూ ఇటీవల మృతిచెందారంటూ మహిళలు ఆగ్రహం వ్యక్తంచేశారు. తరుచూ జరుగుతున్న విద్యుత్ ప్రమాదాలపై అధికారులకు పలుమార్లు విన్నవించినప్పటికీ అధికారుల్లో చలనం లేదని పలువురు మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇళ్ళపై ఉన్న విద్యుత్‌వైర్లను తొలగించకపోతే విద్యుత్ కార్యాలయం వద్ద పెద్దఎత్తున ఆందోళన చేపడతామని అధికారులను హెచ్చరించారు. ఎట్టకేలకు సమాచారం తెలుసుకున్న అధికారులు 15రోజులు సమయం ఇస్తే సమస్య పరిష్కరిస్తామని హామీ ఇచ్చినట్లు గాయత్రి నగర్ వాసులు తెలిపారు.